ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక



ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి
Publisher&Editor: 9391690609,Office :7893003409
aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/

www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం
సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక
# SUPHALA AKSHARAM

SUNDAY 3RD AUGUST 2025 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 128 COST : 3\- KHAMMAM, TELANGANA

ఆదివారం 3 ఆగస్టు 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 128 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## కాళేశ్వరం కేసులో కెసిఆర్ పక్కా దోషి




## దళితులు, ఆదివాసీల
# సంక్షేమం కోసం కృషి

సామాజిక న్యాయం కాంగ్రెస్‌కే సాధ్యం
దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
రాహుల్‌ను ప్రధానిని చేస్తామని తెలంగాణ పక్షాన హామీ
75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
మోడీని గద్దెదించడం కేవలం రాహుల్‌కు మాత్రమే సాధ్యం
కాంగ్రెస్ న్యాయ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి






న్యూఢిల్లీ,ఆగస్ట్2: దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా,గెలిచినా ప్రజల మధ్యే ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని,11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించ ట్లేదని అన్నారు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు.

## లోక్‌సభ ఎన్నికల్లో
# భారీ రిగ్గింగ్

బిజెపికి అనుకూలంగా ఎన్నికల సంఘం పనితీరు
దాని ఆధారాలు తమవద్ద ఉన్నాయి
తాము అధికారంలోకి వచ్చాక దేనినీ వదలం
అధికారులు రిటైర్ అయినా పట్టుకుని శిక్షిస్తాం
కాంగ్రెస్ న్యాయసమీక్ష సదస్సులో రాహుల్



న్యూఢిల్లీ,ఆగస్ట్2: మొన్నటిలోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్షిక న్యాయ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం న్యాయ సమ్మతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు-

## 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ

**వారణాసి,ఆగస్ట్2:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా విడుదల చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ.2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి




## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ

చెరువులు, కుంటల పరిరక్షణపై చర్చించిన కమిషన్.
రైతు కమిషన్ ఆధ్వర్యంలో త్వరలో సమావేశం ఏర్పాటు
సమావేశానికి హాజరుకావాలని మంత్రిని కోరిన కమిషన్
సమగ్ర పాలసీ తోనే చెరువులు, కుంటల అభివృద్ధి: ఉత్తమ్



**హైదరాబాద్,ఆగస్ట్2:** రాష్ట్ర సచివాలయంలో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ-అయ్యింది. ఈ భేటీ-లో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, గడుగు గంగాధర్, భవానీ రెడ్డి వున్నారు. ఇప్పటి వరకు రైతు కమిషన్ చేసిన కార్యక్రమాలను వివరించడంతో పాటు-రాష్ట్రంలో చెరువులు, కుంటల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై మంత్రికి కమిషన్ సూచనలు చేసింది. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణకు వెంటనే నీటి నిర్వహణ కమిటీ-లను ఏర్పాటు- చేయాలనీ చెప్పింది. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా నీటి సంఘాలు వున్న అంశాన్ని గుర్తుచేసింది. గ్రామీణ స్థాయిలో రైతులు సంఘటితమై చెరువులను కాపాడుకునే వారని, ఐతే గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో ఉన్న చెరువులు కుంటలు అన్యాక్రాంతమయ్యాయని వివరించింది. కొన్ని చోట్ల కబ్జాదారులు ఆక్రమించి లే ఔట్లు-వేయడం, వాటర్ బాడీస్ కు

## సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ

కార్పొరేట్ స్థాయిలో శాశ్వత భవనాలు
రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి



## అర్హులైన కుటుంబాలకు
# కొత్త రేషన్ కార్డులు

రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ
సన్నబియ్యంతో ఖజానాపై రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారం
సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో వెనక్కి తగ్గేది లేదు
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



# దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి

కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు. 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయినప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అద్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాటం విజయవంతం కాబోతుందని అన్నారు. దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని, రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదని, దేశానికి మార్గదర్శనం కోసం మనుసింఘ్వీ నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని
చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. మోడీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోడీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. మోడీని ఓడిస్తాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామన్నారు. మాది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. పాకిస్థాన్ ను ఇందిరా గాంధీ రెండు ముక్కలు చేశారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అని కొనియాడారు.

# లోక్‌సభ ఎన్నికల్లో భారీ రిగ్గింగ్

తమ వద్ద ఉన్నాయన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు.

ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడించారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు- గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పుడైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధానసభకు ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు.ఈ క్రమంలో మరోమారు భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ రాహుల్ గాంధీమరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని అన్నారు. ఎన్నికల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా తక్కువ మెజారిటీతో మూడోసారి ప్రధానిగా గెలుపొందారని అన్నారు. భాజపాకు ప్రయోజనం చేకూర్చడానికి ఎన్నికల సంఘం ఓట్ల దొంగతనంలో పాలుపంచుకుందని ఆరోపించారు. 2014 నుంచి ఏదో తప్పు జరుగుతోందని తనకు అనిపిస్తోందని.. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల పైనా అనుమానాలు ఉన్నాయని రాహుల్ అన్నారు.

ఎన్నికల దుర్వినియోగానికి సంబంధించిన అన్ని ఆధారాలు తమవద్ద ఉన్నాయని.. లోక్‌సభ ఎన్నికల్లో
రిగ్గింగ్ ఎలా జరిగిందనే విషయాన్ని త్వరలోనే తాము ప్రజల ముందు నిరూపిస్తామని పేర్కొన్నారు. తాము బయటపెట్టే నిజంతో ఈసీ (ఊఈ) పునాదులు కదిలిపోతాయన్నారు. ఓట్ల కుంభకోణంలో పాల్గొన్న ఎన్నికల కమిషన్ అధికారులు పదవీవిరమణ చేసినా కూడా వారిని వదలమని హెచ్చరించారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించిన ఆయన.. దాన్ని రుజువు చేసేందుకు తమవద్ద అణుబాంబు లాంటి ఆధారాలున్నాయని అన్నారు. కాగా ఈ ఆరోపణలను ఈసీ తీవ్రంగా ఖండించింది. అవన్నీ నిరాధార ఆరోపణలేనని.. రాహుల్ లాంటి వారు చేస్తోన్న బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను పట్టించుకోనక్కర్లేదని తెలిపింది.

# సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ

హైదరాబాద్,ఆగస్ట్2 ఇప్పటికే స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మరో అడుగు ముందుకేసింది. ప్రజలకు మరింత సమర్థవంతంగా పారదర్శకంగా ఒకే చోట సేవలను అందించడానికి వీలుగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీ కరించడంతో పాటు- కార్పోరేట్ స్థాయిలో అత్యాధునిక సౌకర్యాలతో కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రజలకు అసౌకర్యం కలగకుండా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ, కొత్త బిల్డింగ్ల నిర్మాణం ఉండాలని అధికారులకు సూచించారు. అంతిమంగా ప్రజల సంతృప్తే ప్రధానమనే అంశాన్ని దృష్టిలో పెట్టు-కొని పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వాటిలో 37 మాత్రమే సొంత భవనంలో ఉన్నాయని మిగిలినవన్నీ అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని ఈ పరిస్థితిని మార్చడానికి అన్ని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో ఆధునిక సౌకర్యాలతో దశలవారీగా నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో నాలుగు లేదా ఐదు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టు-కొని ఒకే చోట ఇంటిగ్రే-టె-డ్ కార్యాలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను రెండు చోట్ల, రంగారెడ్డి జిల్లాలో 14కు గాను మూడు చోట్ల , మేడ్చల్ జిల్లాలో 12కు గాను మూడు చోట్ల, సంగారెడ్డి , పఠాన్‌చెరువు కలపి ఒకటి మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అత్యాధునిక వసతులతో కార్పోరేట్ స్థాయిలో ఇంటిగ్రే-టె-డ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవనాలను నిర్మించాలని నిర్ణయించినట్లు- వెల్లడించారు. ఆయా జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకొని ఇందుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి గ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడడమే కాకుండా పర్యవేక్షణ సులభమవుతుందని అవినీతిని కూడా తగ్గించవచ్చని, కార్యాలయాల మధ్య పనిభారం సమానంగా ఉండడంతో పాటు- దస్త్రాల ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందన్నారు. మొదటగా హైదరాబాద్‌లోని గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, బాలానగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను, గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఇంటిగ్రే-టె-డ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఒక రోల్ మోడల్ గా ఉంటు-ందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి
రేవంత్ రెడ్డి గారితో చర్చించి ఈ బిల్డింగ్ నమూనాకు తుది రూపునిస్తామని, వీలైనంత త్వరితగతిన ఈ భవనానికి శంకుస్థాపన చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## అర్హులైన కుటుంబాలకు

# కొత్త రేషన్ కార్డులు

పెద్దపల్లి,ఆగస్ట్2: మంథని నియోజకవర్గంలో అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను రాష్ట్ర ఐటీ, మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ముఖ్య ప్రకటనలు చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీకి నాంది పలికింది. ప్రతి అర్హ కుటుంబం సకాలంలో సన్న బియ్యం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సన్న బియ్యం సరఫరా
సక్రమంగా జరిగేలా రెవెన్యూ అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. సన్న బియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల సుమారు రూ. 3 వేల కోట్ల ఆర్థిక భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజల ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మహిళలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని మంత్రి గుర్తుచేశారు. 'ఉచిత బస్ ప్రయాణం అమలు చేయడం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 200 కోట్ల ఉచిత టికెట్లను ఉపయోగించుకున్నారని తెలిపారు. అంతేకాకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతీ నెల రూ. 6 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తున్నప్పటికీ, సంక్షేమ పథకాలను ఎలాంటి ఆటంకం లేకుండా అమలు చేస్తున్నామని చెప్పారు. మంథని అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు, త్వరలో మంథనిలో మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు- చేయనున్నట్లు- తెలిపారు. ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేసినట్లు- చెప్పారు. అదనంగా, 10,200 మందికి కొత్త రేషన్ కార్డులు అందజేసినట్లు- పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి. మంథనిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా కృతనిశ్చయం అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాప్రభుత్వం ప్రజల గౌరవాన్ని పెంచే ఆలోచన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రజల బతుకుల్లో ఏదో మార్పు వస్తుందన్న ఆశతో ఎదురు చూశారన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం ఒక్క రేషన్ కార్డు ఇచ్చే ఆలోచన కూడా చేయలేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం 8 లక్షల కోట్ల వరకు అప్పులు చేసి కూర్చుంటే వాటిపై ప్రతి నెల 7వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నామన్నారు.

ఎంత ఆర్థికభారమైనప్పటికీ ప్రభుత్వం భరించి ప్రజలకు ఒక్కపైసా ఖర్చు లేకుండా రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని ప్రతి వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం ఏమి చేస్తున్నదని అడిగే వారికి జవాబు చెప్పాల్సిన అవసరం కూడా మీపై ఉన్నదన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది మందికి రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం అందించే కార్యక్రమం చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఏమి కావాలి వారిలో ఏ మార్పు తీసుకురావాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. అందులో భాగంగా ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ సన్నబియ్యం అందించాలన్న ఆలోచన చేయడం జరిగిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఇల్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. గతపదేళ్లలో ఒక్కసారి కూడా గ్రూప్ ఒన్ పరీక్షలు నిర్వహించ లేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చిన తర్వాత వివిధ పరీక్షలు నిర్వహించి దాదాపు 65వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. 200 యూనిట్ల కరెంటు- ఉచితంగా అందజేస్తున్నామన్నారు. పేద వారికి భారం ఎలా తగ్గించాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చిందని దానికి రాష్ట్రపతి ఆమోదం ఇప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో రైతు కమిషన్ భేటీ

వచ్చే క్యాచ్ మెంట్ ఏరియాల్లో భారీగా కాల్వలు దెబ్బతినడం, మాయమవడం జరిగాయని వివరించింది. ఐతే ప్రధానంగా చెరువులు కుచించుకపోవడం, గ్రౌండ్ వాటర్ లెవల్స్ పడిపోవడం జరిగిందని వివరించింది. రాష్ట్రంలో చెరువులు కాపాడుకుపడానికి సమగ్రమైన పాలసీ ఉండాలని రైతు కమిషన్ తెలిపింది. ఆ పాలసీని కమిషన్ తయారు చేయనున్నట్లు- వివరించింది. నిపుణులతో పాలసీ కి సంబంధించి ప్రసెంటేషన్ మీటింగ్ త్వరలో కమిషన్ ఏర్పాటు- చేయనున్నట్లు-.. ఆ సమావేశానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరుకావాలని కమిషన్ కోరింది. కమిషన్ ఆహ్వానం కు మంత్రి ఉత్తమ్ సానుకూలంగా స్పందించినట్లు- కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు. వారణాసి పర్యటనలో భాగంగా మోదీ దాదాపు రూ.2,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతోపాటు- శంకుస్థాపన చేశారు. వీటిలో రోడ్లు, ఆసుపత్రులు, స్కూళ్లు సహా రకరకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు వారణాసి ప్రజల జీవితాలను మరింత మెరుగుపరచనున్నాయి. ఈ అభివృద్ధి ప్రాజెక్టులు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కూడా పెంచబోతున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రైతుల జీవితాలు, గ్రామీణ
భారతాన్ని మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఎం యోగి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం కేసులో కెసిఆర్ పక్కా దోషి

సంగారెడ్డి,ఆగస్ట్2: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. కేసీఆర్ దోషి అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెప్పిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృథా చేసి తెలంగాణను కేసీఆర్ అప్పులపాలు చేశారని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పిందని అన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని విమర్శించారు. పాదయాత్రలో భాగంగా శనివారం ఆందోలు మండలం సంగుపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తనకి ఇష్టం ఉన్న చోట కాళేశ్వరం ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. రెండే పిల్లర్లు కుంగాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని...ఇది సామాన్య విషయమా..? అని ప్రశ్నించారు. ఫార్ములా ఈ కారు రేస్‌లో మాజీ మంత్రి కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? అని నిలదీశారు. ప్రభుత్వ సొమ్ము తిన్న వాళ్లు కక్కక తప్పదని మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. మాజీ సిఎం కెసిఆర్ సొంత లాభం మాత్రమే చూసుకున్నారని తెలిపారు. కెసిఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ తేల్చిందని అన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్న నియోజక వర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయని, ప్రతిపక్షాల కుట్రల వల్ల వేరే పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నామని తెలియజేశారు. కాంగ్రెస్‌లో గ్రూపులు సహజం.. పార్టీలో గ్రూపులు ఉండాలని, ఎన్నికల సమయానికి అందరూ పార్టీ కోసం పోరాడాలని సూచించారు. గ్రూపుల వల్ల నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత తమది అని హామీ ఇచ్చారు. కెసిఆర్ కుటుంబం అబద్ధాల పుట్టని, బిఆర్ఎస్ చేతగానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్టుకు ఏపి ప్రభుత్వం సిద్ధమైందని మండిపడ్డారు. తమ ఫిర్యాదు వల్లే బనకచర్ల ప్రాజెక్టు పనులు ఆగాయని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# పుష్కలంగా నీరున్నా..నిర్వహణ లేదు

**అందుకే రాష్ట్రాలమధ్య జల వివాదాలు**

**ఏటా వృథాగా పోతున్న వేల టీఎంసీల గోదావరి నీరు**

**షిప్పింగ్, పోర్టులు, రోడ్లతోనే దేశం వేగంగా అభివృద్ధి**

**రూ.5,233 కోట్ల రహదారులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**మంగళగిరి వేదికగా పలు కార్యక్రమాలకు గడ్కరీ శ్రీకారం**




అమరావతి,ఆగస్ట్2: మనదేశంలో నీటి కొరత సమస్య లేదు.. నీటి నిర్వహణే పెద్ద సమస్య అని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. అందుకే రాష్ట్రాలమధ్య వివాదాలు వస్తున్నాయి. మనదేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 12 శాతం. అది 22 శాతానికి పెరగాలనేది మా లక్ష్యం అని గడ్కరీ అన్నారు. ఏటా వేల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో వృథాగా కలుస్తోంది. దేశ ప్రగతిలో నీరు, విద్యుత్, రవాణా, కమ్యూనికేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఏపీ అభివృద్ధిలో నౌకాయాన శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. తొలుత సభకు వచ్చిన అందరికీ తెలుగులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నమస్కారం చెప్పారు. మంగళగిరి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోని రూ.5,233 కోట్ల విలువైన జాతీయ రహదారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. షిప్పింగ్, పోర్టులు, రోడ్లు అభివృద్ధి చెందితే ఆ దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఏపీ అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోంది. మంచి నాయకుడు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు విజన్ గురించి ఎప్పుడూ వినేవాళ్లం. ఆయన లాంటి విజన్ ఉన్న నాయకుడు అరుదుగా ఉంటారు. ఆయన ఎప్పుడూ భవిష్యత్ గురించే ఆలోచిస్తారని అన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నాం. కొద్దికాలంలోనే జపాన్‌ను అధిగమించాం. ఒకటి, రెండు స్థానాల్లో అమెరికా, చైనా ఉన్నాయి. మోదీ హయాంలో మన రైతులు విద్యుత్ తయారు చేస్తున్నారు. ఇథనాల్ వల్ల దేశంలో రూ.లక్షల కోట్లు ఆదా అవుతాయన్నారు. భవిష్యత్‌లో విమానాలు కూడా రైతులు తయారు చేసే ఇంధనంతోనే నడుస్తాయి. ఇథనాల్, మిథనాల్, సీఎన్‌జీ, బయో డీజిల్ వినియోగం వేగంగా పెరుగుతోంది. ఈవీ వాహనాల తయారీ శరవేగంగా పెరుగుతోంది. లిథియం బ్యాటరీల ఖర్చు క్రమంగా తగ్గుతోంది. వంద శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాలు రావాలి. కాలుష్య రహిత దేశమే మన లక్ష్యం కావాలని అన్నారు ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.లక్ష కోట్లతో పనులు ప్రారంభిస్తాం. నాగ్‌పూర్, జబల్‌పూర్‌లో వరిగడ్డి వినియోగించి రోడ్లు వేశాం అన్నారు.

అమెరికాలో ఉన్న రోడ్ల వల్లనే అమెరికా రిచ్ అయిందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ- సీఎం పవన్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి వైపు వెళ్తోందన్నారు.. చంద్రబాబు విజన్ ఉన్న నేత.. ఎప్పటికీ ఆదర్శంగా ఉంటారు. ఆంధ్రప్రదేశ్ లో షిప్పింగ్ వల్ల ఎంతో అభివృద్ధి చెందుతోంది.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ఏపీని అభివృద్ధి చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నారని కేంద్ర మంత్రి వెల్లడించారు. చంద్రబాబు తను సీఎంగా దేశానికి విజన్ చూపారని.. భవిష్యత్తు పై అవగాహన ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. నాలెడ్జిని వెల్త్ గా మార్చేదే విజన్ అని.. చంద్రబాబు డెవలెప్మెంట్ విజన్ పట్ల ఆయనను అభినందించాల న్నారు. నేను షిప్పింగ్ మంత్రిగా ఉన్నప్పుడు తన వద్ద రూ. 9వేల కోట్లు బడ్జెట్ ఉంటే రూ.12 లక్షల కోట్లు- పనులు చేశామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. పోర్టు ఉన్న రాష్ట్రాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని.. దీంతో బస్సు, రైలు కన్నా జలమార్గంలో చాలా ఖర్చు తగ్గుతుందన్నారు. ఇండియాలో లాజిస్టిక్ కాస్ట్ 16శాతం ఉంటే చైనాలో 8 శాతం అమెరికాలో 12 శాతం ఉందన్నారు. మనం 9 శాతం లాజిస్టిక్ కాస్టుకు వస్తే ఉద్యోగాలు వస్తాయి.. ఎగుమతులు పెరుగుతాయని తెలిపారు. దేశం రోడ్డు నెట్వర్క్ విషయంలో ఏపీలో ఎంతో వర్కు చేశామన్నారు. ఏపీలో లక్ష కోట్ల పనులు చేశాం.. రెండు నెలల్లోనే అమెరికాతో సమానంగా రోడ్లు తయారవుతాయన్నారు. పోలవరానికి హెలికాప్టర్ లో వెళ్లినప్పుడు ఎంతో నీరు సముద్రంలో కలిసిపోతుందని చూశాం. అమెరికా సాటిలైట్ తో ఏఐ వాడి మా గ్రామంలో వ్యవసాయం చేస్తున్నాం. దేశ ఆర్థికవృద్ధిలో 22శాతం వ్యవసాయం నుంచి వస్తోంది. రోడ్లు బాగా వేయాలనే బాధ్యత ప్రధాని నాకు ఇచ్చారు.. నేను ఇంజినీర్‌ని కాదు. గోదావరి నుంచి కావేరి వరకూ నీటిని ఉపయోగించు కోవచ్చు. ఈ దేశంలో పుష్కలంగా నీరు ఉంది.. నీటి వినియోగం సరిగా లేదు. నా వద్ద ఏపీకి సంబంధించి అతిపెద్ద లిస్టు ఉంది.. వెబ్ సైట్లో వాటి వివరాలను ఉంచుతాం. ఏపీలో కూడా యాక్సిడెంట్ల సంఖ్య ఎక్కువే. యాక్సిడెంట్ విషయంలో చాలా ముందు ఉంది. ప్రతి జిల్లాలో వాటిని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నానని నితిన్ గడ్కరి వ్యాఖ్యానించారు.



# భద్రాద్రి జిల్లాకు రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ అవార్డు.

## గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్ కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ 2 ఆగస్టు / అక్షరం న్యూస్ : వెనుకబడిన జిల్లాల ప్రగతికి కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ తీసుకొచ్చిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో అభివృద్ధి సూచికలన్నింటినీ సమర్థంగా సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా రాజ్ భవన్‌లో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలోరాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కు అవార్డు ప్రధానం చేశారు. నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా విద్య, ఆరోగ్యం, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక సంక్షేమం వంటి ఆరు ముఖ్య సూచికలపై 100 శాతం అభివృద్ధి లక్ష్యంగా సంపూర్ణత అభియాన్ కార్యక్రమం చేపట్టబడింది.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ ఆరు సూచికలలో మూడు సూచికలపై శాతం సంపూర్ణత సాధించి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అంతేకాక, గుండాల మండలం బ్లాక్ స్థాయిలో ఐదు సూచికలను విజయవంతంగా పూర్తి చేసి ఆకాంక్షిత బ్లాక్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. నీతి ఆయోగ్ అధికారి బృందాలు చేసిన సమీక్షల ఆధారంగా జిల్లా స్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం ను అవార్డు కోసం ఎంపిక చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ.ఈ అవార్డు రావడం జిల్లాలోని అధికార యంత్రాంగం, మండల అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది మరియు ప్రజల చొరవకు గుర్తింపుగా నిలిచింది అని అన్నారు. ప్రతి







గ్రామానికీ అభివృద్ధి కల్పించాలన్న సంకల్పంతో అన్ని శాఖలు సమన్వయంతో పని చేశాయి అని, ప్రతి సూచికపై కట్టుదిట్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.

ఈ అవార్డు మాకు మరింత బాధ్యతను పెంచిందన్నారు. అభివృద్ధిలో స్థిరత్వం ఉండాలంటే ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. ముందుగానే ప్రణాళికలు రూపొందించి, సమర్థవంతంగా అమలు చేస్తే మరింత ప్రగతి సాధించవచ్చు అన్నారు.భవిష్యత్తులో జిల్లా మరిన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబడేలా చర్యలు కొనసాగుతాయని కలెక్టర్ తెలిపారు..

# నిరంతరం ప్రజాసేవలో ఉంటా

**నాన్న కాక ఆశయాలు నెరవేరుస్తా**
**రాష్ట్ర భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**
**పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం**
**ప్రజా సంఘాలు అభిమానులు సత్కారం**





**పెద్దపల్లి ప్రతినిధి ఆగస్టు 2 అక్షరం న్యూస్!**

నిరంతరం ప్రజాసేవలో ఉంటూ తన తండ్రి వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేస్తానని రాష్ట్ర భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజాసేవ పరమావధిగా తమ కుటుంబం పనిచేస్తుందని ఇకముందు కూడా అలాగే ప్రజాసేవకు అంకితమవుతామని తెలిపారు.పెద్దపల్లి జిల్లా కేంద్రం లోని ఎంబి గార్డెన్ లో మంత్రి వివేక్ వెంకటస్వామి కి వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు.



పెద్దపల్లి జిల్లా కేంద్రం లో కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కి ఘన స్వాగతం పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పలికారు.ఒగ్గు డోలు,ఆదివాసి,డీజే పాటలతో టపాసులు పేల్చి ఘన స్వాగతం పలికిన పెద్దపల్లి ప్రజలు, పెద్దపల్లి కామన్ నుంచి ఎంబి గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు ఎలా సేవ చేయాలనేదే కాక తపన ఉండేది.అందుకే నిరుపేద ప్రజల గుండెల్లో గుడిసెల వెంకటస్వామిగా పేరు తెచ్చుకున్నారు.హైదరాబాద్ లో నిరుపేదలకు 70 వేల ఇండ్లు ఇచ్చిన ఘనత కాక వెంకటస్వామి ది.సింగరేణి సంస్థ %దీఖీ=×% లో కి వెళ్లినప్పుడు 400 కోట్ల రూపాయల ఇప్పించి సింగరేణి సంస్థ కాపాడిన ఘనత కాక దిసింగరేణి బ్రతికించి లక్ష ఉద్యోగాలు కాపాడాడు.దేశ వ్యాప్తంగా కార్మికులకు పెన్షన్ విధానాన్ని అమలు చేసింది కాక ఘనతే.కార్మికులు,బీద ప్రజల కోసమే ఆలోచించే వ్యక్తి కాక...ఆయన అడుగు జాడల్లో నడుస్తున్నాం.ఎంతో మంది నిరుపేదలకు కాక ఫౌండేషన్,విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు అందించాం.తెలంగాణ ఉద్యమ సమయం లో నాకు మంత్రి పదవి ఇస్తా అఫర్ చేశారు కానీ నేను తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కొట్లాడాను 300 మంది ఆత్మ బలిదానాలు తో తెలంగాణ ఏర్పడింది.అమరులకు ఒక్కొకరికి లక్ష రూపాయలు ఇచ్చాం.పెద్దపల్లి లో నేను ఎంపీ గా ఉన్నపుడు 700 కోట్ల రూపాయలతో త్రాగు నీటి అవసరాలు తీర్చాం..రోడ్లు,డ్రైనేజ్ లు వేశాం.నేను ఎంపీ గా ఉన్నపుడు పెద్దపల్లి అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడ్డానుమూతపడ్డ రామగుండం %=ఖీజూ% నీ రీ ఓపెన్ చేయడం కోసం ఎంతో కృషి చేశాను..కేంద్రం తో కోట్లాడాను. మోదీ గాలి ఉన్నపుడు కూడా పెద్దపల్లి లో కాంగ్రెస్ గెలిచింది.మన పెద్దపల్లి చుట్టు ఉన్న పార్లమెంట్ పరిధిలో బిజెపి గెలిచింది.గడ్డం ఫ్యామిలో లో అవినీతి ఉండదు..ఆ ఆలోచన కూడా రాదు..మాకు సేవ చేయడమే లక్ష్యం.రేవంత్ రెడ్డి నా పై నమ్మకం ఉంచి మైనింగ్ శాఖ ఇచ్చారునేను వచ్చాక ఇసుక మాఫియా ను అణచివేశంఇసుక దందా లు చేస్తే కేసులు పెట్టండి అని ఆదేశాలు ఇచ్చాను.ఎంపీ వంశీ పై కూడా బాధ్యత ఉంది..దాని కోసం నిరంతరం పని చేస్తాడు చేయాలి.దేశం లోనే అత్యధికంగా ట్రైన్ హాల్టింగ్స్ ఇచ్చిన ఏకైక ఘనత మాకే దక్కుతుంది.రామగుండం,పెద్దపల్లి,మంచిర్యాల,బెల్లంపల్లి లో ప్రజలు కు అవసరం ఉన్న చోట రైల్వే హాల్టింగ్ ల కోసం కృషి చేశా.ప్రయాణికుల కష్టాలు తీరుస్తున్నాం.సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ పెంపు కోసం ఎంపీ వంశీ క్రిష్ణ పార్లమెంట్ లో కోట్లడారు పదవులు ముఖ్యం కాదు ప్రజలు ముఖ్యం వారి సంక్షేమం ముఖ్యం.కాక ఫ్యామిలీ అంటేనే సేవ చేసే ఫ్యామిలీ.మేము ఏమి చేస్తున్నామనేది ప్రజలకు తెలుసు.అందుకే మమ్మల్ని గెలిపించింది మీ అక్కున చేర్చుకుంటున్నారు.పెద్దపల్లి ప్రజలందరూ ఇంత ప్రేమ చూపెట్టినందుకు మీకు శిరస్సు వంచి నమస్కరిస్తున్న. మీ ఆశీర్వాదం ఎల్లవేళలా మాకు ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను.


# జిల్లా ప్రధాన న్యాయమూర్తి పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ కొత్తగూడెం లీగల్/ 2 ఆగస్టు అక్షరం న్యూస్ :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్, జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ జైలులో ఉన్న ముద్దాయిల కేసులను దశలవారీగా , రోజువారిగా సాక్ష్యాలు ప్రవేశపెట్టి అంతిమ తీర్పులకు సహకరించాలని, వారెంట్లు ఉన్న పెండింగ్ కేసులు వెంట వెంటనే అమలు పరచాలని తెలిపారు. పాత పెండింగ్ కేసులలో సాక్ష్యాలను తీసుకొని రావాలని, నూతనంగా నమోదైన కేసులలో వెంటనే ఛార్జ్ షీట్స్ దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి ఎస్. సరిత, ,ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కే. కిరణ్ కుమార్ , జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఏం. రాజేందర్ ,అదనపు సీనియర్ సివిల్ జడ్జి కర్నాటి కవిత, రెండవ అదనపు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ బి. రవి కుమార్ సుపరీ%శీ%టెండెంట్ ఆఫ్ పోలీస్ బిరుదు రాజు రోహిత్ రాజు , ఏ.ఎస్పీ .విక్రమ్ కుమార్ సింగ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఏ పి పి లు,జిల్లాలోని డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు ,సబ్ ఇన్స్పెక్టర్లు ఫారెస్ట్ అధికారులు ,ఎక్సైజ్ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, కోర్టు నోడల్ ఆఫీసర్, కోర్టు లైజాన్ ఆఫీసర్లు,పోలీస్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# ఆర్టీసీకి 28.74 ఇంధనం ఆదాసేసిన ఔట్సోర్సింగ్ డ్రైవర్ వెంకటరెడ్డి



**ఓదెల/ పెద్దపల్లి ఆగస్టు 02(అక్షరం న్యూస్)**

ఓదెల మండలంలోని జీలకుంట గ్రామానికి చెందిన సింతి రెడ్డి వెంకటరెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా హుజురాబాద్ డిపోలో అవుట్సోర్సింగ్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జులై నెలలో ఆర్టీసీకి 28.74 లీటర్ల ఇంధనం ఆదాసేసినందుకు డిపో మేనేజర్ అభినందించారు. చేసింది అవుట్సోర్సింగ్ అయిన మంచి వినయంతో బస్సును నడిపి ఇంధనాన్ని ఆదా చేయడం గొప్ప విషయమని అన్నారు ఇంధనం ఆదా చేయడంలో మూడో మూడో వ్యక్తిని కొనియాడారు

# బల్లెం పోటీల్లో ఓదెల మండలానికి బంగారు పథకాల హారం




**ఓదెల/ పెద్దపల్లి ఆగస్ట్ 02(అక్షరం న్యూస్)**

శనివారం సుల్తానాబాద్ జూనియర్ కాలేజీ గ్రౌండ్ వేదికగా జరిగిన జావెలిన్ త్రో జిల్లా స్థాయి పోటీల్లో ఓదెల మండలం దాసరి పద్మా హన్మయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కనగర్తి జే గ్రామానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ తో 5 బంగారు పతకాలు మరియు3 వెండి పథకాలు4 కాంస్య పథకాలతో మొత్తంగా 12 పథకాలులి సాధించి జిల్లా స్థాయిలో ఓదెల మండలం ను అగ్రస్థానం లో నిలబెట్టారు.పథకాలు సాధించిన విద్యార్థులకు ఓదెల ఎంఈఓ వై రమేష్ ,పాఠశాల సిబ్బంది,గ్రామ ప్రజా ప్రతినిధులు విద్యార్థుల తల్లి దండ్రులు శుభాకాంక్షలు తెలిపారు.

# చీపురుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం వార్డెన్ పై చర్యలు తీసుకోవాలి

**ఆకలితో అలమటిస్తున్న గిరిజన విద్యార్థులు**
**విద్యార్థులపై అలసటత్వం వహిస్తున్న పట్టించుకోని ఉన్నతాధికారులు**
**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఏ టి డబ్ల్యూఓ సమాచార అధికారిని కలిసి హెచ్ఎం మరియు వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు**
**అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / 2 ఆగస్ట్ /అక్షరం న్యూస్ :**

దమ్మపేట మండల%శీ% లో చీపురుగూడెం ఆశ్రమ పాఠశాల హెచ్ఎం వార్డెన్ పై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్

జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు పెద్దపీట వేసి ఉన్నత విద్యను అందించే క్రమంలో విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఏజెన్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నం కొనసాగుతుందని , చీపురుగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు గిరిజన మరియు పేద విద్యార్థులని అలాంటి విద్యార్థులను మోసం చేస్తూ హెచ్ఎం మరియు వార్డెన్ సొమ్ము చేసుకోవడం బాధాకరమని, ఆశ్రమ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు చదువుకునే దానికోసం ఆశ్రమ పాఠశాలకు వస్తే వాళ్లని అడ్డాగా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారని ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు కారణం అని పాఠశాలలో ఉండే విద్యార్థులకు వాళ్లు వేసుకునే హాజరు సంఖ్యకు ఏమాత్రం సంబంధం లేకుండా జిసిసి నుండి వస్తున్న అన్ని రకాల పప్పు ఉప్పు మంచి నూనె మొదలగు వాటిని అమ్ముకుంటూ గిరిజన విద్యార్థుల కడుపు కొడుతు హెచ్ఎం వార్డెన్ల లావాదేవీల మీద విద్యార్థులకు అందవలసిన గుడ్డు అరటిపండు స్నాక్స్ మొదలగు వాటిని కూడా పెట్టకుండా విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై ఐటిఐ పిఓ గారు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమైక్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి పక్షణ డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సుజన్ జిల్లా సమితి సభ్యులు రాజ్ కమల్ మహేష్ తదితరులు పాల్గొన్నారు

# ఆహేలే ఖురేషీ కమిటీ ఆధ్వర్యంలో సాబీర్ పాషా కు ఘన సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /2 ఆగస్ట్ /అక్షరం న్యూస్ :**

సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా మూడోసారి సాబీర్ పాషా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆహేలే ఖురేషీ సొసైటీ కమిటీ అధ్యక్షులు జాఫర్ ఖురేషీ ఆధ్వర్యంలో ఓల్డ్ డిపో కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఖురేషి సొసైటీ కొత్తగూడెంలో కమేల,ఖురేషి కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాకి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు ఉర్దూగర్ చైర్మన్ డాక్టర్ నయిమ్ ఖురేషి, అమీర్ ఖాద్రి, మొహమ్మద్ హుస్సేన్,రుక్కుముద్దీన్, మొహమ్మద్ సిరాజ్, ఖాసిం,ఎండి నసురు,గౌస్, ఫయాజ్,సుకూర్,నజీర్, ముఖిమ్,తదితరులు పాల్గొన్నారు.



# గోదావరి వరదలపై సమీక్షా సమావేశం




**భద్రాచలం ఆగస్ట్ 02 (అక్షరం న్యూస్)**

గోదావరి వరదల సమయంలో ముంపునకు గురి అయ్యే మండలాల్లోని ప్రజలు అకస్మాత్తుగా వరదలు పెరిగినప్పుడు పోలీసులు, అధికారుల దృష్టికి తీసుకుపోతే వెంటనే ఎన్ డి ఆర్ ఎఫ్ బృందంను రంగము లోకి దించి సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి అవకాశం కలుగుతుందని భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం సబ్ కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జాతీయ విపత్తుల స్పందన దళం సారథ్యంలో గోదావరి వరదల సమయంలో భద్రాచలం, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాలలోని ముంపునకు గురి అయ్యే ప్రాంతములోని ప్రజలకు పోలీస్, రెవెన్యూ సిబ్బంది తీసుకోవలసిన జాగ్రత్తలపై, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు తో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరదలకు ముంపునకు గురి అయ్యే మండలాలు మరియు గ్రామాలలో వరదలు ఎక్కువైనప్పుడు ప్రజలు పై అధికారుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. అనుకోకుండా గోదావరి వరదకు కొట్టుకు పోయేటప్పుడు లైఫ్ జాకెట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలి రావచ్చని ఆయన అన్నారు. అలాగే గ్రామాలలో వాగులు, వంకలు పొంగుతూ ఉంటాయని, వాగు దాటేటప్పుడు ముంపు ప్రాంతాల ప్రజలు ఎవరైనా తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించి వాగులు దాటాలని అన్నారు. గోదావరి వరదల సమయంలో తీసుకోవలసిన రక్షణ చర్యలపై ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం డెమో ద్వారా తప్పనిసరిగా గ్రామాలలోని ప్రజలకు సలహాలు సూచనలు ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామాలలోని మనసులు కానీ, పశువులు కానీ నీటిలో కొట్టుకుపోతూ ఉంటే ప్రాణ నష్టం జరగకుండా చూడవలసిన బాధ్యత రెవెన్యూ, పోలీస్ ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం పైన ఉందని, గ్రామంలోని ప్రజలకు తప్పనిసరిగా వరదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేస్తూ ఉండాలని ఆయన అన్నారు. ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురైన ప్రజలకు సిపిఆర్ ద్వారా ప్రాణ నష్టం జరగకుండా చూడవచ్చని సిపిఆర్ కి సంబంధించిన అవగాహన కూడా ప్రజలకు తెలియజేయాలని ఆయన అన్నారు.

అనంతరం వరదలలో కొట్టుకుపోయిన మనుషులను ఏ విధంగా కాపాడాలో డెమో ద్వారా ప్రాక్టికల్ గా ఎన్డీఆర్ బృందం సమావేశానికి వచ్చిన అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డిటి ధనియాల వెంకటేశ్వరరావు ఎన్ డి ఆర్ ఎఫ్ టెన్త్ బెటాలియన్ డిఎఫ్ఓలు ఇమజ్, కోటేశ్వరరావు, మంగరాజు, నరేందర్ మరియు రెవెన్యూ, ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసి దినోత్సవానికి పూర్తి సహాయ సహకారాలు పిఓ

**భద్రాచలం ఆగస్ట్ 02 (అక్షరం న్యూస్)**

ఆగస్టు మాసం 9వ తేదీన జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఎటువంటి లోటు పాట్లు జరగకుండా గత సంవత్సరం కంటే ఘనంగా జరుపుకోవడానికి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆదివాసి గిరిజన సంఘ నాయకులకు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. శనివారం ఐటిడిఏ సమావేశం మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ఆదివాసి తెగల సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ మారుమూల ప్రాంతాలలో నివసించే ఆదివాసి గిరిజన తెగలు ఘనంగా జరుపుకునే వేడుకను తెలంగాణ ప్రభుత్వం ఆదేశానుసారం ఐటిడిఏ తరపున ఆగస్టు 9వ తారీఖు నాడు అందరూ కలిసి ఐకమత్యంగా ఉంటూ ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆయన అన్నారు. ఆదివాసి గిరిజనుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వం తరపున విడుదలైన సంక్షేమ పథకాల చాయ చిత్ర ప్రదర్శనశాలల ఏర్పాట్లు, ట్రైబల్ కల్చర్, మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించడం, అన్ని ఆదివాసి సంఘాలతో ఘనంగా ర్యాలీ నిర్వహించడం, ప్రముఖుల ప్రసంగాలతో పాటు, ఆదివాసి గిరిజనుల ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు మరియు వ్యవసాయం చేసుకునేటప్పుడు భూమి పండుగ చేయడం వారి యొక్క ఆచారమని అలాగే వారి యొక్క హక్కులను కాపాడుకోవడానికి సమాజానికి తెలియజేసే స్థాయికి ఈరోజు ఆదివాసి గిరిజనులు ఎదిగారని వీరి సంక్షేమం కోసం ఐటీడీఏ ను ఏర్పాటు చేయడం జరిగిందని, సమన్వయ కమిటీ సభ్యులు అందరూ కోఆర్డినేషన్తో ఏ తప్పులు జరగకుండా చూడాలని, గిరిజన భవనంలో జరిగే కార్యక్రమంలో అన్ని సంఘాల నాయకులకు మాట్లాడడానికి అవకాశం కల్పించే విధంగా చూడాలని, అలాగే సన్మాన గ్రహీతలను కూడా మీరే గుర్తించి జాబితా అందించాలని, ఈ సంవత్సరం వినుత్నంగా ఆదివాసి తెగల ఇలవేల్పుల గ్రంథం పాతతరం గిరిజన పెద్దలను అడిగి తెలుసుకుని సేకరిస్తున్నామని 500 సంవత్సరాల క్రితం ఆచరించిన గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు మరియు ఆచార వ్యవహారాలు వారి గోత్రాలు 3000 సంవత్సరాలైనా చెక్కుచెదరకుండా ఉండడానికి మరియు రాబోయే తరానికి తెలియజేయడానికి వివిధ తెగల తలపతులు, ఆర్తి బిడ్డల సమక్షంలో సేకరించిన వివరాలను పూర్తిస్థాయిలో రూపొందించి ఆగస్టు 9న ఆవిష్కరించడానికి ప్రయత్నిస్తున్నామని అందుకు కార్యాచరణ కమిటీ సభ్యులు మీ యొక్క సలహాలు సూచనలు అందించి ఇలవేల్పుల గ్రంథమును పూర్తిస్థాయిలో రూపుదిద్దుకునేలా సహకారం అందించాలని, అలాగే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని వివిధ ఆదివాసి సంఘాల ప్రతినిధులు మరియు అధికారులతో ఐక్య కార్యాచరణ కమిటీ నియమించి కమిటీ సూచనలు మేరకు ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని, ఆదివాసి సంఘ నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ హరీష్, మేనేజర్ ఆదినారాయణ వివిధ ఆదివాసి సంఘాల నాయకులు రమణయ్య, ఉదయం కృష్ణ, చినబాబు దొర, కుంజ ధర్మ, మురల రమేష్, శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను సంఘ నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు.



# ఎదురుదాడితో... అక్రమాలను దాచలేము !

ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధికారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో....మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు. కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించుకోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్,హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది. అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూళ్లో శిక్షణ పొంది వచ్చినవారు. ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది. ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు.

ఒక ఉద్యమ పార్టీగా ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొర్రెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు.

ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది. అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజల ను నిందించడమే అవుతుంది. జగన్, కెటిఆర్‌లు ఇది గమనించాలి. ప్రజలను అవమానిస్తున్న ఈ నేతలను ప్రజలు దూరంగా పెట్టాలి. బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణకు సాధ్యమైనంత మోసం చేయమెలా అన్న రీతిలో పాలన సాగింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష మేరకు అసలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని రాలేకపోయింది. రైతులు అప్పుల్లోనే ఉన్నారు, యువత నిరుద్యోగంలో ఉన్నారు. రుణమాఫీ రాయితీల పేరుతో కొంతమంది మాత్రమే లబ్ధి పొందారు. పేపర్ లీకులు, గ్రూప్ పరీక్షల వాయిదాలు, పోలీస్ పరీక్షల గందరగోళం ఇవన్నీ యువత భవిష్యత్తును నాశనం చేశాయి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ అప్పు రూ. 6.5 లక్షల కోట్లకు చేరింది. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ఇవన్నీ పేరుకి ప్రాజెక్టులు. కానీ అన్నీ అవినీతి పథకాలే. జేబులు నింపే పథకాలే. గ్రామాల్లోకి తాగునీరు, విద్య, ఆరోగ్య పరిరక్షణకు తీసుకున్నచర్యలు లేవు. ఇవన్నీ కూడా ఇక్కడ బిఆర్ఎస్‌కు ఎపిలో వైకాపాకు వర్తిస్తాయి.

# పార్లమెంట్ సాక్షిగా యూరియాపై తప్పుడు లెక్కలు

**ఖరీఫ్ కేటాయింపులు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే**

**ఇప్పటికే 2.24 లక్షల మెట్రిక్ టన్నుల లోటు**

**కేంద్రమంత్రి అనుప్రియా పటేల్‌కు మంత్రి తుమ్మల లేఖ**



హైదరాబాద్,ఆగస్ట్2:పార్లమెంట్ సాక్షిగా యూరియా సరఫరాపై తప్పుడు లెక్కలు చెప్పడం శోచనీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుగారు అన్నారు. రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించి, పార్లమెంట్ లో మాత్రం 20.20 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటు-లో ఉందని చెప్పడం వలన రాష్ట్ర రైతులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని మంత్రిగారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులపై కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయమంత్రి అనుప్రియ పటేల్ గారికి కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల విభాగం రాష్ట్రానికి కేటాయించిన ఎరువుల లేఖను జతపరిచి మంత్రి తుమ్మల లేఖ రాశారు. ఖరీఫ్ 2025 కోసం రాష్ట్రానికి కేవలం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని, కేటాయించిన దానిలో కూడా నెలవారి సరఫరా చేయాల్సిన దానికంటే తక్కువగా సరఫరా చేయడం వలన రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు కేటాయింపుల ప్రకారం 6.60 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేయాల్సి ఉండగా, కేంద్రం 4.36 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాగారికి లేఖలు కూడా రాయడం జరిగిందని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్ లాంటి వేదికలలో కూడా తప్పుడు లెక్కలు సమర్పించడం రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, జులై మాసం వరకు కేటాయింపుల ప్రకారం సరఫరా కాని 2.24 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కలుపుకొని, ఆగస్టు నెలకు కేటాయించిన యూరియాను త్వరగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రిగారు లేఖలో కోరారు.

# మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్

**కెటిఆర్ పరువునష్టం కేసులో క్రిమినల్ కేసు నమోదుకు ఆదేశం**



హైదరాబాద్,ఆగస్ట్2: మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. మంత్రిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో కోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఫోన్ ట్యాంపింగ్, డ్రగ్స్, టాలీవుడ్ హీరోయిన్ సమంత విడాకుల వ్యవహారంలో కొండా సురేఖ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు. కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి సురేఖపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసులను నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రాథమిక సాక్ష్యాలను పరిశీలించిన నేపథ్యంలో కొండా సురేఖపై ఆగస్టు 21లోగా క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితురాలికి నోటీసు జారీ చేయాలని స్పష్టం చేసింది. కేటీఆర్‌పైన మంత్రి నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేటీఆర్ తరపున న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఫిర్యాదుతోపాటు సాక్ష్యుల వాంగ్మూలాలు, డాక్యుమెంట్స్‌ను పరిశీలించిన తర్వాత ఆదేశాలు జారీ చేసింది. నిందితురాలు కొండా సురేఖపై ప్రాథమిక కేసు ఉన్నట్లు నాంపల్లి కోర్టు గుర్తించింది.

# యువతను క్రీడల వైపు మళ్ళిస్తున్నాం

**అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేయత్నం**

**మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడి**

హైదరాబాద్,ఆగస్ట్2:యువతను క్రీడల వైపు మళ్ళిస్తూ ,అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుటకు తెలంగాణ క్రీడల పాలసీని తీసుకురావడం జరిగిందని రాష్ట్ర క్రీడల యువజన సర్వీసుల పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. శనివారం హెచ్ఐసీసీలో ఫస్ట్ ఎడిషన్ తెలంగాణ స్పోర్ట్స్ కన్ క్లేవ్ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసులు పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోనే కొత్తగా స్పోర్ట్స్ పాలసీని అమలు చేస్తూ అన్ని క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన ఈ పాలసీ ద్వారా క్రీడలు ఎంతగానో అభివృద్ధి చెందుతాయని అన్నారు. క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ వాటి ప్రాముఖ్యతను పెంచే విధంగా నూతన క్రీడా విధానం అమలు చేస్తూ అమలు చేయుటలో పని చేస్తామని మంత్రి తెలిపారు. ఈ పాలసీ అమలులో గతంలో క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు, దీర్ఘకాలంగా క్రీడల్లో ఉన్న వారు, క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించే వారికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభిస్తున్న క్రీడల పాలసీ క్రీడల అభివృద్ధి కొరకు క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీయుటకు దోహదపడుతుందని మంత్రి తన అభిప్రాయాన్ని తెలిపారు.

ఈ పాలసీలో పొందుపరిచిన జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహకుల సహాయ సహకారాలు తీసుకొని ఆస్థాయిలో క్రీడల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. 2036లో జరిగే ఒలింపిక్స్ ను లక్ష్యంగా చేసుకొని క్రీడాకారులకు ఆయా క్రీడలలో శిక్షణ ఇప్పించడం జరుగుతుందని, తమ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా క్రీడాకారులకు విధి విధానాలను కల్పిస్తూ ఈ పాలసీకి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారని మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం బడ్జెట్లో క్రీడలకు ఎక్కువ నిధులు కేటాయించిందని, క్రీడల స్టేడియాలకు, క్రీడాకారుల వసతులకు, వసతులకు క్రీడాకారులకు కల్పించే మౌలిక వసతులకు అధిక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ- చైర్మన్ శివసేనారెడ్డి, అడ్వైజర్ జితేందర్ రెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాల చారి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేశ్ రంజన్, ఘాఆఘ వైస్ ఛైర్మన్ మరియు ఎం.డి. సోనీ బాల, గోపిచంద్ అకాడమీ ఫౌండర్ పుల్లెల గోపీచంద్, ప్రముఖ క్రీడాకారులైన గగన్ నారంగ్, అంజు బాబి జార్జ్, సుమిత్ పాండే, అభినవ్ బింద్రా, రవికాంత్ రెడ్డి, నీలం బాబర్ దేశాయ్, తతగత ముఖర్జీ, సబనాయకన్ విశ్వనాథ్, అడిళ్ళ సుమరివాల, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్బిఐ లైఫ్ డివిజనల్ టాపర్గా సిహెచ్ రమాదేవి

## అత్యధిక ప్రతిభ కనబరిచినందుకుగాను వరుసగా మూడోసారి ఎన్నిక.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ బూర్గంపాడు మండలం/ సారపాక.**
**అక్షరం న్యూస్/ ఆగస్టు 2:**

ఎస్బిఐ లైఫ్ బి సి ఎం బ్రాంచ్ క్వార్టర్లీ నిర్వహించు సమావేశం నందు అత్యధిక ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు అందించే ప్రతిభా పురస్కారాన్ని వరుసగా మూడవసారి ఉమ్మడి ఖమ్మం జిల్లా డివిజనల్ మేనేజర్ కురుమల శ్రీనివాస్ గారి చేతుల మీదుగా సారపాక గ్రామానికి చెందిన సిహెచ్ రమాదేవి అందించారు ఈ కర్యక్రమాన్ని ఉద్దేశించి కురుమల శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, ఉమెన్ ఎంపవర్మెంట్ లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా డైరెక్ట్ సెల్లింగ్ లో 70 శాతం మంది మహిళలు రాణిస్తున్నారు ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ మరియు అడ్వైజర్ గా చేరడం వలన ప్రతి నెల 30 వేల నుంచి 3 లక్షల వరకు సంపాదిస్తూ ఐదు సంవత్సరాల తర్వాత పనిచేయకపోయినా జీవితాంతం మంచి ఆదాయాన్ని పొందుతూ ఒక పెన్షనర్ గా జీవించే అవకాశం ఉందని ఉచిత బీమా సదుపాయం ఉంటుందని ఒక మహిళ తలుచుకుంటే ఏదైనా సాధించగలదు అని ఆసక్తిగల 18 సంవత్సరాలు నిండిన మహిళలు ఎవరైనా సరే మీకు వినే ఓపిక నేర్చుకోవాలని ఆసక్తి సాధించగలనని పట్టుదల ఉంటే చాలు మేము చెప్పినట్టు కమిట్మెంట్తో పని చేస్తే తప్పకుండా మంచి ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు దీని ద్వారా మహిళలు గృహిణులు ఆర్థికంగా సామాజికంగా రాణించడానికి ఇది చక్కని అవకాశం అని తెలిపారు ఈ సమావేశంలో బ్రాంచ్ మేనేజర్ మోతె రవికుమార్ రెడ్డి మరియు సంబంధిత అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# తోటి యూనియన్ సభ్యుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**మహబూబాబాద్ /కేసముద్రం /ఆగస్ట్ 2/అక్షరం న్యూస్ :-**

తోటి యూనియన్ సభ్యుడు రామకృష్ణారెడ్డి అకాల మరణం చెందడం జరిగింది.దానికి గాను మన యూనియన్ నుండి 10000 రూ " ఆర్థిక సహాయం మరియు తోటి సభ్యులు పెద్ద మనసుతో వారికి తోచిన ఆర్థిక సహాయం చేసినటువంటి 10000 రూపాయలు కలిపి మొత్తం 20000 వేల రూ " శనివారం మన యూనియన్ సభ్యుడు రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం మొత్తాన్ని అందజేయడం జరిగింది..వారికి ఇక ముందు ఎలాంటి అవసరం ఉన్న మన యూనియన్ సభ్యులు ఎప్పటికీ తోడుగా ఉంటామని వారికి మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిలుముల మహేష్, ఉపాధ్యక్షులు పింగిలి సంతోష్, కోశాధికారి నాగనబోయిన నరసయ్య,కార్యవర్గ సభ్యులు సిలివేరు గణేష్,సభ్యులు రావుల అనిల్,గాడిపెల్లి సంతోష్ పాల్గొనడం జరిగింది. మరొకసారి ఆర్థిక సహాయం చేసిన నాతోటి సభ్యులు అందరికీ పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదలు అని ఈ సందర్భంగా అధ్యక్షులు చిదుముల సంతోష్ తెలిపారు.

# మెసెంజర్ల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన ఉన్నతాధికారులు



**మహబూబాబాద్/కేసముద్రం /ఆగస్ట్ 2/అక్షరం న్యూస్ :-**

తెలంగాణ లో విద్యాశాఖ పరిధి సమగ్ర శిక్షా అభియాన్ కింద మండల విద్యా కేంద్రంలో( ఎంఆర్సి ) పనిచేస్తున్న మెసెంజర్లకు జి. ఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని రాష్ట్ర విద్యాశాకాదికారులయిన స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మరియు అసిస్టెంట్ ఎస్ పి డి లను హైదరాబాద్ లో ని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం లో కమిషనర్ అండ్ రాధారెడ్డి మేడం ఎస్పిడి ని కలవడం జరిగింది రాష్ట్ర మెసెంజర్ల యూనియన్ భాద్యులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోతు భిక్షపతి రాష్ట్ర బాధ్యులు గౌరవ అధ్యక్షులు డి శ్రీనివాస్ రావు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ మేరకు భిక్షపతి మాట్లాడుతూ అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మాదిరి వేతనాల పెంపు, మెసెంజర్ల కు జరగలేదని, జి.ఓ.నెంబర్ 60 ప్రకారం వేతనాలు రూ.15600 గా చెల్లిస్తున్నారని,మెసెంజర్ల కు ఇంకా ఆ పెంపు జరగలేదని అన్నారు.ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని, ఫైల్ ను ప్రభుత్వ అనుమతి తో త్వరలో ఉత్తర్వులు ఇప్పించుటకు హామీ ఇచ్చారని అన్నారు.

# ఓటు అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్కే ఉంది

## స్థానిక ఎన్నికలలో గులాబీ జెండా ఎగురవేయాలి -మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



**జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్)ఆగస్టు 02:** మూడు నెలల్లో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పదవి గోవిందా.. గోవిందా.. అంటూ స్టేషనఘన్పూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు తాటికొండ రాజయ్య ఎద్దేవ చేశారు. ఊరూరికి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు.. ఇంటింటికి కేసీఆర్ ఫలాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాపలగడతండ, కుసుంబాయితండ. జాపరగూడెం, అశ్వరావుపల్లి, వెల్ది గ్రామాలలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శనివారం పర్యటించి ప్రజల కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెల్ది లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు కడియం శ్రీహరికి చెంప పెట్టు లాంటిదని, అతనికి ఏ మాత్రం నీతి, నిజాయితి ఉన్న వెంటనే పదవికి రాజీనామా చేసి ప్రజా క్షేత్రంలో న్యాయమైన పోరాటానికి సిద్ధపడాలని అన్నారు. నమ్మిన ప్రజలను, కార్యకర్తలను మోసం చేసి పదవుల కోసం, కుటుంబ సభ్యుల రాజకీయ ఎదుగుదల కోసం పార్టీలను మారడం ప్రజాస్వామ్యానికి చేటు అని కడియం గుర్తించక పోవడం సిగ్గుచేటని విమర్శించారు. అనాడు ఎన్టీఆర్..చంద్రబాబు నాయుడు.. మొన్నటికి మొన్న కెసిఆర్ కు వెన్నుపోటుపొడిచి.....వెన్నుపోటులు చరిత్రను తన సొంతం చేసుకున్న స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పదవి మరో మూడు నెలల్లో పోవడం.. ఉప ఎన్నిక రావడం ఖాయమన్న ధీమాను వ్యక్తం చేశారు. 1985 లోనే పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని ప్రవేశపెట్టి రాజ్యాంగంలోని 52వ సవరణలో భాగంగా పదవ షెడ్యూల్ ప్రకారం ఒక పార్టీ నుండి గెలిచి మరో పార్టీలో చేరడానికి ముందు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానితో పాటు పదవికి రాజీనామా చేయాలనే నిబంధనను పొందుపర్చారని, 2/3 వంతు మంది సభ్యులు వేరే పార్టీలో చేరినప్పుడు మాత్రమే ఈ నిబంధన వర్తించదన్న విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి గులాబీ జెండాను ఎగురవేయడానికి కార్యకర్తలు కం కణబద్ధులై అంకిత భావంతో పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. స్థానిక ఎన్నికలలో ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్ కు మాత్రమే ఉందని తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టుపెడుతున్న రేవంత్ రెడ్డి డమ్మీ సిఎం అని, స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ కు ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇంచార్జ్జివై, కుమార్, పెండ్లి మల్లారెడ్డి, కొర్ర రాజేందర్ నాయక్, ముప్పిడి శ్రీనివాస్,నూనె ముంతల యాకస్వామి, సత్తిరెడ్డి, తిరుమల్ రెడ్డి, పెద్దగోని రాజు, ముప్పిడి సాంబ, మడ్లపల్లి సునీత, తిప్పారపు మమత, తదితరులు పాల్గొన్నారు

# బోధనా ప్రణాళికలను రూపొందించుకొని పాఠ్య బోధన చేయాలి

## మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి

**మహబూబాబాద్ /కేసముద్రం /ఆగస్ట్ 2/అక్షరం న్యూస్ :-**

ఉపాధ్యాయులు ప్రణాళికలు రూపొందించుకొని తదనుగుణంగా పాఠ్య బోధన చేయాలని కేసముద్రం మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అన్నారు.కాంప్లెక్స్ సమావేశాలలో భాగంగా శనివారం తాళ్లపూసపల్లి జడ్పీ హైస్కూల్ నందు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు, కేసముద్రం విలేజ్ జడ్పీ హైస్కూల్ నందు భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు.ఆయా కాంప్లెక్స్ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ కాలేరు యాదగిరి మాట్లాడుతూ.కాంప్లెక్స్ సమావేశాలలో నేర్చు కున్న విషయాలను పాఠశాలలో ఉపయోగించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని అన్నారు.చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు.విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకే సమాజంలో చక్కని గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు పట్ల ఉపాధ్యాయులకు నిర్లక్ష్యం తగదని,ప్రతి ఉపాధ్యాయుడు విధిగా ఎఫ్ ఆర్ ఎస్ యాప్ లో ముఖ గుర్తింపు హాజరు వేయాలని మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి తెలిపారు.ఈ కార్యక్రమంలో కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చీకటి వెంకట్రాం నరసయ్య, తాళ్ళపూస పల్లి జడ్పీ హైస్కూల్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు దేశ బోయిన వెంకన్న,ఆర్పీలు సునీత, శ్రీనివాస్ రెడ్డి,మధుకర్ తో పాటు పలువురు ఉపాధ్యాయ,ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.



# పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత నిధులు విడుదల



**పెద్దపల్లి రూరల్ ఆగస్టు 2, అక్షరం న్యూస్**

పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలోని రైతు వేదికల్లో కృషి విజ్ఞాన్ కేంద్రం ( కె వి కె ) రామగిరి ఆధ్వర్యంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 20వ విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. గౌరవ ప్రధానమంత్రి గారు నిధులను విడుదల చేయగా, ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ప్రసారం చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ భక్తి శ్రీనివాస్, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీ శ్రీనాథ్, కె.వి.కె రామగిరి శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ శ్రీ శ్రీనివాస, డాక్టర్ వెంకన్న, డాక్టర్ నవ్య, మండల వ్యవసాయ అధికారి అలివేణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.పెద్దపల్లి మండలంలోని ఆరు క్లస్టర్లకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులు వినయ్, సువర్చల, పూర్ణచందర్, రచన, కల్పన, ప్రశాంత్ లతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పీఎం కిసాన్ పథకం ప్రాముఖ్యతను వివరించారు. ఈ నిధులు రైతులకు వ్యవసాయ ఖర్చుల కోసం ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

# కేసముద్రం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ జరుగుచున్నవి

## - ప్రిన్సిపల్ బైరి ప్రభాకర్

**మహబూబాబాద్ /కేసముద్రం /ఆగస్ట్ 2/అక్షరం న్యూస్ :**

–కేసముద్రం పట్టణంలో నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ (ఈవి),ఎలక్ట్రానిక్స్ ( ఈఎంబి) బ్రాంచీలలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ జరునట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ తెలియచేసినారు.దరఖాస్తులు తేదీ ఈ నెల 06 నుండీ 08 వరకు స్వీకరించబడును మరియు స్పాట్ అడ్మిషన్స్ తేదీ 08 నాడు ఉదయం 11.00 గంటలకు నిర్వహించబడునని తెలియచేసినారు.వివరాల కొరకు ప్రిన్సిపాల్:8977222648,నర్సయ్య 9848664703,సురేష్ 9989173035 ను సంప్రదించగలరు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తెలిపినారు.



# రక్తదానం నేత్రదానం అవయవదానం సామాజిక బాధ్యత... అదనపు కలెక్టర్ అరుణశ్రీ



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రక్త , నేత్ర , అవయవ, శరీర దానాలు సామాజిక భాద్యతని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మెప్మా ఆర్ పి లకు రక్త , నేత్ర , అవయవ, శరీర దానాలపై అవగాహన కల్పించారు . ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమ%శీ%లో ఆమె మాట్లాడుతూ వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని డైరెక్టర్ , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుండి జారీ చేసిన ఆదేశాల తో పాటు రామగుండం నగర పాలక సంస్థ నిర్వహించిన రక్త దాన శిబిరానికి మంచి స్పందన వచ్చిన నేపథ్యంలో సదాశయ ఫౌండేషన్ సమన్వయంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆర్ పి లు తాము తరచుగా పాల్గొనే ఎస్ హెచ్ జి , ఎస్ ఎల్ ఎఫ్ సమావేశాల్లో రక్త , నేత్ర , అవయవ, శరీర దానాల పై అవగాహన కల్పించాలని కోరారు. ప్రస్తుత%శీ% నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాలను కూడా విజయవంతం చేయాలని కోరారు. పెద్దపల్లి డి ఎం అండ్ హెచ్ ఓ అన్న ప్రసన్న కుమారి మాట్లాడుతూ మరణానంతరంతో పాటు జీవించి ఉండగానే కొన్ని అవయవాలు దానం చేయవచ్చని అన్నారు. తల్లిపాలు, రక్తం , కాలేయం , క్లోమం , వెంట్రుకలు , చర్మం జీవించి ఉండగానే దానం చేయవచ్చని మరణానంతరం నేత్రాలతో పాటు ఇతర అవయవాలు కూడా దానం చేయవచ్చని అన్నారు. రక్త దానం పై అపోహలు వీడి ఒక ఏడాదిలో కనీసం నాలుగు సార్లు రక్త దానం చేయాలని అన్నారు. బిడ్డ పుట్టిన అరగంట లోపు ముర్రు పాలు పట్టిస్తే శిశువులకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ విషయం గురించి తల్లిపాల వారోత్సవాల సంధర్భంగా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రి ఆర్ ఎం ఓ . దండె రాజు మాట్లాడుతూ శరీర దానం వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వైద్య విద్యార్థులు భౌతిక కాయాన్ని ఒక దైవ స్వరూపంగా భావిస్తారని అన్నారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కె . ఎస్ వాసు మాట్లాడుతూ అమ్మ జన్మ నిస్తే , అవయవ దాత పునర్జన్మ నిస్తారని అన్నారు. స్వచ్ఛందంగా నేత్ర , అవయవ , శరీర దానం చేయాలనుకున్న వారు తమ ఫౌండేషన్ ప్రతినిధులను సంప్రదిస్తే అన్ని వివరాలు ఇచ్చి నమోదు చేయిస్తారని అన్నారు. భర్త మరణించిన దుఖాన్ని కూడా దిగమింగి అవయవ దానానికి అంగీకరించి ఎనిమిది మంది పునర్జన్మకు కారణమైన మెప్మా సి . ఓ . శమతకమణి , తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ నేత్ర దానానికి అంగీకరించి ఇద్దరికి కంటి చూపు ప్రసాదించడానికి కారణమైన మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి విజయ్ లకు ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందన పత్రం అందించి శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణా రెడ్డి , జాతీయ ప్రదాన కార్యదర్శి లింగమూర్తి , మెప్మా టి ఎం సి మౌనిక , మెప్మా ఆర్ పి లు పాల్గొన్నారు. కాగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట



స్వామి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది బృందం గౌతమి నగర్ లో ఇంటింటికీ తిరుగుతూ తడి చెత్త , పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఆస్తి పన్ను మదింపుకు సంబందించి రెవెన్యూ ఇన్స్పెక్టర్ శంకర్ రావు ఆధ్వర్యంలో కొత్త ఇళ్ల కొలతలను నమోదు చేసుకున్నారు.



## కాంగ్రెస్ పార్టీ శ్రేణులను కలిసి స్థలం పరిశీలించిన ఎమ్మెల్లే ఎం ఎస్ రాజ్ ఠాకూర్, మనాలి ఠాకూర్

### నేడు మురుమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభం





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

అంతర్గాం మండలం లో ఆదివారం మురుమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రుల పర్యటనకు సంబంధించిన పనులను రామగుండం శాసనసభ్యులు మక్కాన్సింగ్ శనివారం పరిశీలించారు. ఆదివారం మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్మణ్ కుమార్ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ ఈ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో ఉపన్యసిస్తారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లి పాల వారోత్సవాలు పురస్కరించుకొని బాలింతలకు తల్లి పాల అవగాహన





జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఈరోజు స్థానిక ప్రభుత్వ వైద్య శాలలో రామగుండం ఐసిడిఎస్ అలేఖ్య పటేల్ ఆదేశాల మేరకుప్రభుత్వ వైద్యశాలలో తల్లి పాల ప్రాముఖ్యత గురించి ఫస్ట్ టైమ్ తల్లి అయిన వారికి మరియు డెలివరి అయిన బాలింతలకు తల్లికి మొదటి సారి వచ్చే తల్లి పాలు (ముర్రుపాలు) వాటి ప్రాముఖ్యత గురించి వివరించి చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్స్ షరిన్, జమున, మమత అంగన్ వాడి టీచర్స్ పాల్గొన్నారు.

## ఆగస్టు 5న 2వ రాష్ట్ర జూనియర్ - సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్షిప్

### ....జిల్లా సంక్షేమ శాఖ అధికారి పి.వేణు గోపాల్

పెద్దపల్లి, ప్రతినిధి ఆగస్టు - 02 అక్షరం న్యూస్

ఆగస్టు 5న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియం లోని అథ్లెటిక్ గ్రౌండ్ లో 2వ రాష్ట్ర జూనియర్ %ం% సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ ఛాంపియన్షిప్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి పి.వేణు గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చాంపియన్షిప్ యువ పారా అథ్లెట్లను తమ ప్రతిభను ప్రదర్శించడానికి పోటీ అనుభవాన్ని పొందడానికి విజయవంతమైన క్రీడా కెరియర్ ను నిర్మించుకోవడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని, ఆసక్తి ఉన్న దివ్యాంగులు పారా అథ్లెటిక్స్ చాంపియన్షిప్ లో

## రాష్ట్ర అధ్యక్షుల పర్యటన నేపథ్యంలో గోదావరిఖనిలో బీజేపీ సమీక్షా సమావేశం...!



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఆగస్టు 5, 6 తేదీలలో జరుగనున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుల పర్యటన నేపథ్యంలో ఆదివారం గోదావరిఖని మార్కండేయ కాలనీ బీజేపీ కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశానికి రామగుండం నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీమతి కందుల సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "రాష్ట్ర స్థాయి నాయకుల పర్యటనను విజయవంతం చెయ్యాలని కోరారు. అందుకే ప్రతి బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు నాయకులు, మండల అధ్యక్షులు, ప్రభారీలు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో ముందుకు రావాలి" అని తెలిపారు. అలాగే, ఈ పర్యటనను విజయవంతం చేయడం ద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలాన్ని మరో మెట్టు ఎక్కించేందుకు ఇది ఓ గొప్ప అవకాశమని వారు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఐత పవన్, బోడకుంటి సుభాష్, ఉదగొండలపర్త,గుండ బోయిన భూమన్న మాజీ మండల అధ్యక్షులు కోడూరి రమేష్ మరియు సీనియర్ నాయకులు పిడుగు కృష్ణతోట కుమారస్వామి,తడగొండ నరసన్న,మచ్చ విశ్వాస్,ఉడుమూరి చిరంజీవి,సిలువేరు అంజి,గర్భందుల అభి,అంది రాజకుమార్ చారి,జక్కన బాలు,సిలారపు కళ్యాణ్,సంతోష్, బంగారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### .....జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ముత్తారం పి.హెచ్.సి ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 02 అక్షరం న్యూస్బీ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి అన్నారు.శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముత్తారం పి. హెచ్.సి ను ఆకస్మికంగాలి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ లో జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలను, స్టాఫ్ అటెండెన్స్ పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఎంత మంది ఔట్ పేషెంట్ వస్తున్నారో ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఔట్ పేషంట్ లలో వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలని, ముందస్తుగా వ్యాధి నిర్ధారణ జరిగితే మెరుగైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని , సమయ పాలన పాటించాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అమరేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 5 నుంచి 8 వరకు కలెక్టరేట్ లో ఆధార్ సవరణ, నూతన ఆధార్ కార్డు కోసం ప్రత్యేక క్యాంపు

ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు ప్రత్యేక క్యాంపు పై పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్



పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు -02 అక్షరం న్యూస్

ఆగస్టు 5 నుంచి 8 వరకు కలెక్టరేట్ ఆవరణ లో ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు కోసం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్షలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక క్యాంపులో నూతన ఆధార్ కార్డు ఎన్ రోల్ మెంట్ ఉచితంగా జరుగుతుందని అన్నారు. బయోమెట్రిక్ అప్ డేషన్ (ఫింగర్ ప్రింట్,ఐరిస్, ఫోటో) చేయడానికి 100 రూపాయల రుసుం మరియు డెమోగ్రాఫిక్ అప్ డేషన్ బయోమెట్రిక్ అప్ డేట్ తో కలిసి చేస్తే ఉచితంగా ఉంటుందని, ప్రత్యేకంగా డెమోగ్రాఫిక్ అప్ డేషన్(అడ్రస్,మొబైల్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, పేరు...) 50 రూపాయల రుసుము చెల్లించాలని కలెక్టర్ తెలిపారు.నూతనంగా ఆధార్ కార్డు పొందేందుకు కావాల్సిన ధృవ పత్రములు మీసేవ ద్వారా అడ్రస్ తో జారీ చేయబడిన బర్త్ సర్టిఫికెట్ , తల్లి లేదా తండ్రి అప్ డేట్ చేసిన ఆధార్ కార్డు మరియు ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు కోసం ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా నివాస సర్టిఫికెట్, బ్యాంకు పుస్తకం/ పోస్టల్ బుక్ తో సహా అటెస్టెడ్ దరఖాస్తు ఫారం ఉండాలని, ఆధార్ కార్డు లో పేరు అక్షరాల సవరణ,పొరపాట్ల సవరణకు ఓటర్ ఐడి లేదా పాస్ పోర్ట్ లేదా పాన్ కార్డు లేదా ఎస్.ఎస్.సి మార్కుల మెమో లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేదా మైనర్ ఐతే బర్త్ సర్టిఫికెట్ ఉండాలని, పెళ్లి తర్వాత పేరు మార్పు కోసం సబ్ రిజిస్ట్రర్ జారీ చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ , పెళ్లి ఫోటో, ఇతర గుర్తింపు కార్డులు ఉండాలని, పూర్తిగా పేరు మార్పు కోసం గెజిట్ (%ఒఓ%) చేసి ఉండాలని,ఆధార్ కార్డు లో డేట్ ఆఫ్ బర్త్ కరెక్షన్ కోసం బర్త్ సర్టిఫికెట్ , 21 సంవత్సరాల పైబడిన వారికి ఫోటో తో కూడిన మార్కుల మెమో లేదా ఇండియన్ పాస్ పోర్ట్ ఉండాలని అన్నారు. ఆధార్ కార్డు లో సవరణలు లేదా కొత్త ఆధార్ కార్డు దరఖాస్తు కొరకు తమ ఒరిజినల్ ధృవ పత్రములు తప్పనిసరిగా తీసుకొని రావాలని, కలెక్టరేట్ లో ఏర్పాటు చేసే ఆధార్ సవరణ మరియు నూతన ఆధార్ కార్డు ను ప్రజలు, ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వ పాలన

**....రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు**

**ప్రతి కుటుంబానికి నెలకు సగటున 1200 రూపాయల విలువ గల సన్న బియ్యం ఉచితంగా అందిస్తున్నాం**

**వీ హబ్ ఉప కేంద్రం పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు**

**మహిళల కోసం మంథని సమీపంలో ప్రత్యేక పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు కృషి**

**ఆర్.ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు**

**పెద్దపల్లి, ఆగస్టు-02 అక్షరం న్యూస్**

పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కోరారు.శనివారం మంథని ప్రాంతంలో రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి ఆర్.ఆర్ గార్డెన్స్ లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ, మహిళా శక్తి సంబరాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లిమంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,లి అర్హులైన పేద ప్రజలకు రేషన్ కార్డుల జారీ చేయాలని ప్రతిపక్షంలో అనేక సందర్భాలలో ధర్నాలు చేసినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులకు నూతన రేషన్ కార్డులతో పాటు 50 నుంచి 60 రూపాయల విలువ చేసే సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. రేషన్ ద్వారా దొడ్డు బియ్యం సరఫరా చేయడం ద్వారా రీసైక్లింగ్ గురై అక్రమార్కులు మాత్రమే బాగు పడ్డారని, నేడు సన్న బియ్యం సరఫరా పేద ప్రజలకు ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రతి కుటుంబానికి సగటున నెలకు 1200 రూపాయల విలువ గల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు. రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ కార్యక్రమం సక్రమంగా చేయాలని అన్నారు.

పేద ప్రజలకు నాణ్యమైన విద్య అందించడం కోసం పెద్ద ఎత్తున ఆదర్శ పాఠశాలలను మన హయాంలో ఏర్పాటు చేశామని మంత్రి గుర్తు చేశారు. వేములవాడ రాజన్న, కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి, సమక్క సారలమ్మ జాతర వెళ్లడానికి, రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం సౌకర్యం కల్పించిందని అన్నారు. ఆర్టీసీ బస్సులు ఉచితంగా ప్రయాణించే మహిళలకు ఇప్పటి వరకు 200 కోట్ల పైగా జీరో టికెట్లు జారీ చేసి 6680 కోట్ల రూపాయలు మహిళల తరపున ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. పేద ప్రజల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తున్నామని అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాల పథకం డబ్బులను గత ప్రభుత్వం జమ చేయ లేదని మంత్రి విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కార్యక్రమం మళ్ళీ ప్రారంభించామని అన్నారు. మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందేందుకు ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్క్ మహిళల కోసం ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు వ్యాపార నైపుణ్యాలలో శిక్షణ అందించేందుకు వీ-హబ్ ఉప కేంద్రం పెద్దపెల్లి జిల్లాలో ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద డైయిరీ, పౌల్ట్రీ ఫార్మ్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. మహిళలకు మంథని లో కుట్టు మిషన్ శిక్షణ అందిస్తున్నామని, రాబోయే కాలంలో కొన్ని కంపెనీలను ఇక్కడ ఏర్పాటు ప్రతిపాదనలు ఆలోచిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వస్తువుల కల్పన పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టామని అన్నారు. రైతు సోదరులకు ఒకే సంవత్సరంలో 21 వేల కోట్ల రూపాయల ఖర్చు చేసి 2 లక్షల రుణ మాఫీ పూర్తి చేశామని అన్నారు. 9 రోజుల వ్యవధిలో 9 వేల కోట్ల రైతు భరోసా సొమ్ము విడుదల చేశామని అన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంచామని, మొదటి సంవత్సరంలో 60 వేల నిరుద్యోగ యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు పంపిణీ చేశామని అన్నారు. ప్రైవేట్ రంగంలో యువతకు ఉపాధి కల్పించాలని గతంలో ఎన్నడు లేని విధంగా భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం జరిగిందని అన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. మంథని నియోజకవర్గ పరిధిలో మొదటి దశలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. చివరి లబ్ధిదారుడి వరకు ఇల్లు చేరేలా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని, ప్రతి సంవత్సరం నూతనంగా ఇండ్లు మంజూరు చేస్తామని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. ఇండ్ల స్థలాలు లేని నిరు పేదలకు ప్రభుత్వ భూములను కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు కట్టించే సంకల్పం చేస్తున్నామని అన్నారు. అడవి సోమన పల్లి లో 200 కోట్లు ఖర్చు చేసి కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉండేలా ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణం చేస్తున్నామని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు 40 శాతం డైట్ చార్జీలు పెంచామని అన్నారు.లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి గత 20 నెలల కాలంలో ప్రభుత్వం అన్ని రంగాలలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించిన ప్రాధాన్యత పై సంబరాలు చేసుకుంటూ భవిష్యత్తులో మహిళల అభ్యున్నతికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవడానికి మహిళా శక్తి సంబరాలు జరుపుకుంటున్నామని అన్నారు. జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన రేషన్ కార్డుల ద్వారా 25 వేల పైగా ప్రజలకు లబ్ధి పొందనున్నారని తెలిపారు. రేషన్ కార్డు జారీ నిరంతర ప్రక్రియి గా కొనసాగుతుందని, ప్రజలు నేరుగా ప్రజా పాలన కేంద్రాలు, మీ సేవా సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే విచారించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని అన్నారు.అనంతరం మంత్రి శ్రీధర్ బాబు రామగిరి, మంథని, ముత్తారం, కమాన్ పూర్ మండలాలకు చెందిన 2389 స్వశక్తి మహిళా సంఘాలకు 2 కోట్ల 37 లక్షల వడ్డీ రాయితీ చెక్కు, సహజంగా మరణించిన 17 మంది సంఘ సభ్యులకు 14 లక్షల 66 వేల 344 రూపాయల లోన్ బీమా చెక్కు, ప్రమాదవశాత్తు మరణించిన ఒక మహిళా సంఘ సభ్యురాలి కుటుంబానికి 10 లక్షల రూపాయల ప్రమాద బీమా చెక్కు, 385 శివశక్తి మహిళా సంఘాలకు 30 కోట్ల రూపాయల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా మూడు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అంతకుముందు మంథని పట్టణం లో పెట్రోల్ బంక్ ఏరియా ,పెద్దపల్లి రోడ్డు, గోదావరిఖని రోడ్డులో 6 కోట్ల 70 లక్షల రూపాయలతో నెలకొల్పిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను, రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో 2 కోట్ల 60 లక్షల రూపాయల నిధులతో కల్వచర్ల నుంచి లోంక కేశారం వరకు నిర్మించిన సిసి రోడ్డు ను మంత్రి ప్రారంభించారు. మంథని ఎంపీడీవో కార్యాలయం వద్ద మంథని పట్టణంలో 20 కోట్ల 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించే 410 ఇందిరమ్మ ఇండ్ల పైలాన్, 7 గ్రామాలలో కోటి 40 లక్షలతో నిర్మించే గ్రామపంచాయతీ భవనాలకు, ఎక్లాస్పూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2 కోట్ల 70 లక్షలతో నూతనంగా నిర్మించబోతున్న బాయ్స్ హాస్టల్ భవనానికి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సింగరేణి సిఎస్ఆర్ నిధుల కింద పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడే క్యూఆర్ కోడ్ పుస్తకాలు పంపిణీ చేసారు. అటవీశాఖ%ఈ% మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ గౌడ్, ఆర్.డి.ఓ. సురేష్, తహసిల్దార్, ఎంపిడిఓ, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికల కోడ్ రావడంతో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించుకోలేకపోయాం

**టిఆర్ఎస్ చేపట్టిన ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ చేసినట్లు ఫోజులు కొడుతున్నారు**

**-మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్**



**జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎల్లంపల్లి వద్ద గోదావరి నదిపై శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించినప్పటికీ ఇక్కడి రైతులకు చుక్క నీరు ఇవ్వకుండా అరిగోస పెట్టింది కాంగ్రెస్ పార్టీ వారు కాదా అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ప్రశ్నించారు.ఎప్పుడో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిపైనే రామగుండం రైతులు ఆధారపడాల్సి దుస్థితికి కారణం కాంగ్రెస్ పార్టీ వారిని ధ్వజమెత్తారు. చివరి ఆయకట్టు రైతుల పంట పొలాలకు నీళ్లు అందక పంటలు ఎండిపోతుంటే రామగుండం రైతుల కోసం ఒక ఎత్తిపోతల పథకం నిర్మించాలని బీఆర్ఎస్ పార్టీ మొదటిసారి అధికారంలోకి వచ్చాక అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2017 డిసెంబర్లో రూ.72 ఓట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పథకానికి భూమి పూజ చేసేందుకు 2018 ఫిబ్రవరి 27న అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా మూర్ మూర్ గ్రామానికి వచ్చారని చెప్పారు. ఈ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించినప్పటికీ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల పనులు ఆలస్యం అయ్యాయని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దాదాపు ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనులు అన్నింటిని కూడా పూర్తి చేయడం జరిగింది కుక్కలగూడూర్ రైతులను అడిగితే చెప్తారని పేర్కొన్నారు. పైపులు వేసిన సంగతి కాంగ్రెస్ పార్టీ వారికి కనీసం ఇక్కడి రైతులకు నీరు అందించేందుకు ఒక ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలనే సోయి కూడా వారికి లేదని, తాము చేపట్టిన పనులను వారు ఏదో సాధించినట్లుగా ఫోజులు కొట్టడం సిగ్గుచేటు అని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే ఓటు ద్వారా కర్రు కాల్చి వాత పెడతారని కోరుకంటి చందర్ హెచ్చరించారు. ఎన్నికల కోడ్ రావడంతో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించుకోలేకపోయామని, రామగుండం రైతులకు అన్ని విషయాలు తెలుసునని అన్నారు.

## క్రిమిసంహారక మందు త్రాగి మహిళ మృతి



**మహబూబాబాద్/కేసముద్రం /ఆగస్ట్ 2/అక్షరం న్యూస్ :-**

కేసముద్రం మండలంలో మనస్థాపానికి గురై క్రిమిసంహారక మందు త్రాగి ఓ మహిళ మృతి చెందిన ఘటన వెంకటగిరిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ వివరాలు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. మల్లూరి నర్సమ్మ (60), సం" భర్త లక్ష్మయ్య 65సం" వృత్తి వ్యవసాయం మృతురాలుకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.మృతురాలు గత కొద్ది సంవత్సరాల నుంచి అనారోగ్యంతో సమస్యలతో బాధపడుతుంది.ఎన్ని సంవత్సరాలు అయినా మందులు వాడుతున్నా కానీ ఇంకా నయం కానీ క్రమంలో మృతురాలు మనస్థాపానికి గురై శనివారం ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు త్రాగి ఇంటికి రాగ కుటుంబ సభ్యులు అట్టి విషయాన్ని గమనించి మృతురాలు కోడలు వెంటనే అదే ఊర్లో ఉంటున్న మృతురాలు యొక్క అల్లుడికి ఫోన్ చేసి వారి యొక్క ఆటోలో మహబూబాబాద్ తీసుకొని వస్తూ మార్గం మధ్యలో 108 అంబులెన్స్ లో ఎక్కించి చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా హాస్పిటల్ తరలించగా ఉదయం 11:30 నిమిషములకు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుమారుడు మల్లూరి యాకయ్య తెలిపారు. కుమారుడు మల్లూరి యాకయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుని కంటి చూపు సజీవం..!

**- ఆత్మహత్య చేసుకున్న యువకుడు**

**- దుఃఖంలో కూడా నేత్రదానం చేసిన తల్లిదండ్రులు**



**జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

గోదావరిఖనిలోని జ్యోతి నగర కు చెందిన బండారి రాకేష్(30) అనే యువకుడు, శనివారం ఇంట్లో ఆత్మహత్య చేసుకోగా... కొడుకును కోల్పోయిన దుఃఖంలో కూడా ఇద్దరికి చూపును ప్రసాదించడానికి కొడుకు నేత్రాలను తల్లిదండ్రులు దానం చేసి స్ఫూర్తిగా నిలిచారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్లో హరిత హారం వాటర్ ట్యాంకర్ డ్రైవర్ గా పని చేస్తున్న బండారి భద్రయ్య – వినోద దంపతులకు కుమారుడు రాకేష్ తోపాటు కూతురు ఉన్నారు. రాకేష్ ఓ ద్విచక్ర వాహనం షో రూంలో మెకానిక్ గా పని చేశాడు. గత మూడు నెలలుగా అనారోగ్య సమస్యలతో ఇంట్లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి వరకు అందరితో ఆప్యాయంగా పలకరించిన రాకేష్, తెల్లవారేసరి శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. ఇద్దరికి వెలుగులు ప్రసాదించడానికి కొడుకు నేత్రాలను దానం చేయడానికి కుటుంబ సభ్యులు అంగీకారం తెలుపగా, ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతిని కార్నియాలను సేకరించి హైదరాబాదుకు తరలించారు. ఇద్దరికి చూపును ప్రసాదించడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి వాసు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ రాజేందర్, జోన్ చైర్మన్ పి. మల్లికార్జున్, అధ్యక్షులు ఎల్లప్ప, కార్యదర్శి సారయ్య, కోశాధికారి రాజేందర్ అభినందించారు.

## వనవాసీ విద్యార్థులకు వైద్య పరీక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం చర్ల అక్షరం న్యూస్ ఆగస్టు 2–**

మండల కేంద్రం లోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంలో శనివారం కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రీధర్ నేతృత్వంలో వైద్య శిబిరం నిర్వహించారు. 25 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి చిరు వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులను పంపిణీ చేసారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు త్వరలో పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేస్తామని తెలియచేసారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్ నిలయ కమిటీ అధ్యక్షులు తాటి పాపారావు ఉపాధ్యక్షులు జవ్వాది మురళీకృష్ణ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి ఆశా కార్యకర్త ఉషారాణి పాల్గొన్నారు.



# ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మూడో స్థానానికి చేరుకుంటుంది



దిల్లీ: రాబోయే కొన్నేళ్లలో భారత్ 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని 'ప్రపంచ ఆర్థిక వేదిక' అధ్యక్షుడు బోర్గే బ్రెండే అంచనా వేశారు.ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మూడో స్థానానికి చేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్‌లో ఉన్న ఆశావహ దృక్పథం ప్రస్తుతానికి ప్రపంచంలో మరెక్కడా కనిపించడం లేదని గురువారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.సమయం వచ్చినప్పుడు భారత ప్రభుత్వ సహకారంతో డబ్ల్యూఈఎఫ్ ఇండియా సమ్మిట్ ద్వారా తిరిగి దేశానికి రావాలనుకుంటున్నట్లు బ్రెండే తెలిపారు. ఏటా జనవరిలో దావోస్ కేంద్రంగా జరిగే డబ్ల్యూఈఎఫ్ సమావేశానికి ప్రధాని మోదీకి ఎప్పటికీ ఆహ్వానం ఉంటుందని తెలిపారు. భారత్ కొన్నేళ్లపాటు ఏడు శాతం వార్షిక వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేశారు. గతకొంతకాలంగా దేశంలో కీలక సంస్కరణలు చోటుచేసుకున్నాయని తెలిపారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సైతం ఊపందుకున్నాయని పేర్కొన్నారు. తయారీ కార్యకలాపాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు .ప్రపంచవ్యాప్తంగా నేడు సంప్రదాయ పద్ధతిలో కంటే డిజిటల్ వాణిజ్యమే వేగంగా విస్తరిస్తోందని బ్రెండే తెలిపారు. ఈ తరుణంలో డిజిటల్ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని కొనియాడారు. మరోవైపు వచ్చే కొన్నేళ్లలో అంతర్జాతీయ వేదికలపై దౌత్యపరంగా భారత్ తనదైన పాత్ర పోషిస్తుందన్నారు. చాలా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం నుంచి భారత్ దూరంగా ఉండగలిగిందన్నారు. పొరుగు దేశాలతో సవాళ్లు ఎదురైనప్పటికీ.. వాటిని సమర్థంగా ఎదుర్కోగలిగిందని తెలిపారు.భారత్ 2027 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కంపెనీ జెఫరీస్ అంచనా వేసింది. తద్వారా జర్మనీ, జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని తెలిపింది. 2030 నాటికి పది ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులు భారత్‌ను విస్మరించడం సాధ్యమయ్యే పనికాదని అభిప్రాయపడింది. జీఎస్టీ అమలు, దివాలా స్మృతి చట్టం, రెరా, నోట్ల రద్దు వంటి కీలక సంస్కరణల ప్రభావం ఉన్నప్పటికీ.. భారత జీడీపీ వృద్ధి పథంలో సాగిందని వివరించింది.వచ్చే ఐదేళ్ల పాటు భారత్ ఆరు శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తుందని జెఫరీస్ తెలిపింది. అదే సమయంలో ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల వృద్ధి క్షీణించే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు దేశీయ ఈక్విటీ మార్కెట్లు వచ్చే ఐదు నుంచి ఏడేళ్ల పాటు 8-10 శాతం రాబడినిస్తాయని అంచనా వేసింది.

# బిజినెస్

## ఐకూ నుంచి నియో 9ప్రో.. 4 ఏళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్



చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ ఐకూ నియో సిరీస్‌లో మరో ఫ్లాగ్‌షిప్ ఫోన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది.ఐకూ నియో9ప్రో పేరుతో దీన్ని తీసుకొచ్చింది. 120%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు ఈ ఫోన్ సపోర్ట్ చేస్తుంది. ఔటాఫ్‌ది బాక్స్ ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఫన్‌టచ్ ఓఎస్‌తో వస్తున్న ఈ ఫోన్‌కు.. మరో మూడు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ కూడా ఇస్తామని హామీ ఇస్తోంది. మరి ఈ ఫోన్ ధరెంత? ఫీచర్లేంటి?ఐకూ నియో 9 ప్రో 5జీ స్మార్ట్‌ఫోన్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. బేసిక్ వేరియంట్ 8జీబీం128జీబీ ధరను రూ.35,999గా కంపెనీ నిర్ణయించింది. 8జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.37,999గా పేర్కొంది. 12జీబీం256 జీబీ స్టోరేజీ వేరియంట్ ధర రూ.39,999గా నిర్ణయించింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ కార్డులపై కొనుగోలు చేస్తే రూ.2వేల వరకు డిస్కౌంట్ పొందొచ్చు. నలుపు, ఎరుపు రంగుల్లో లభిస్తుంది. బేస్ వేరియంట్ మినహా మిగిలిన రెండు వేరియంట్లు అమెజాన్, ఐకూ ఇ-స్టోర్లలో ఫిబ్రవరి 23 నుంచి అమ్మకానికి రానున్నాయి. ప్రీ బుక్ చేసుకున్న వారు 22 మధ్యాహ్నం నుంచే కొనుగోలు చేయొచ్చు. బేస్ వేరియంట్ మార్చి 21న అందుబాటులోకి రానుంది. ఇక ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులో 6.78 అంగుళాల 1.5%ి% ఎల్‌టీపీఓ అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120%ఎ్ఓ% రిఫ్రెష్ రేటు ఉంటుంది. గేమింగ్ సమయంలో 144%ఎ్ఓ% రిఫ్రెష్‌రేటుతో పనిచేస్తుంది. కొత్తగా వెట్ టచ్ టెక్నాలజీని ఇందులో పరిచయం చేశారు. దీనివల్ల తడిచేత్తో ఫోన్‌ను ఆపరేట్ చేసినా డిస్‌ప్లే పనిచేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 8 జనరేషన్ 2 చిప్‌సెట్‌తో వస్తోంది. ఇందులో వెనుక 50ఎంపీ సోనీ ఐఎంఎక్స్ 920 సెన్సర్ ఇచ్చారు. ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌తో వస్తోంది. 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఉంది. ముందువైపు 16 ఎంపీ కెమెరా ఇచ్చారు. 5,160 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇది 120%ఔ% సూపర్‌వూక్ ఛార్జింగ్ సదుపాయం ఇచ్చారు.

## ఆఖర్లో కొనుగోళ్ల మద్దతు.. లాభాల్లో మార్కెట్ సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా మిశ్రమ సంకేతాల మధ్య నష్టాల్లో ప్రారంభమైన సూచీలు ఆ తర్వాత కోలుకున్నాయి.టీసీఎస్, ఐటీసీ, రిలయన్స్ వంటి ప్రధాన షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. కనిష్ఠాల నుంచి సెన్సెక్స్ 1100 పాయింట్లు పైకెగిసింది.సెన్సెక్స్ ఈ ఉదయం 72,677.51 వద్ద (క్రితం ముగింపు 72,623.09) ప్రారంభమై మెల్లగా నష్టాల్లోకి జారుకొంది. మధ్యాహ్నం 1 గంట వరకు నష్టాల్లో కొనసాగిన సూచీ.. కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్ ముగిసే సమయానికి భారీగా పుంజుకుంది. ఇంట్రాడేలో 73,256.39 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 535.15 పాయింట్ల లాభంతో 73,158.24 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 162.40 పాయింట్ల లాభంతో 22,217.45 వద్ద స్థిర పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 82.84గా ముగిసింది.సెన్సెక్స్-30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, ఐటీసీ, ఎంఅండ్ఎం, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ, మారుతీ సుజుకీ, విప్రో, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, ఇన్ఫీ, టాటా మోటార్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇండస్ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, భారతీ ఎయిర్‌టెల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.

# ఆరోగ్యం- మహాభాగ్యం

## ఇలా ఉంటేనే స్వేచ్ఛగా.. స్వతంత్రంగా..!



మహిళలుగా మనం అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నాం. స్వతంత్రంగా జీవిస్తున్నాం. అయితే డబ్బు, కెరీర్... ఇలాంటి వాటిలోనే కాదు.. జీవితానికి సంబంధించిన అన్ని అంశాల్లోనూ స్వతంత్రంగా జీవించగలిగితేనే మనం కోరుకునే సంతృప్తి లభిస్తుంది.ఈ క్రమంలో స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించడానికి దోహదపడే కొన్ని అంశాలేంటో చూద్దాం...ఆత్మవిశ్వాసంతో ముందుకు..ఏ విషయంలోనైనా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం మన సొంతమవుతుందనే విషయం తెలిసిందే. అయితే కొన్ని విషయాల్లో లోపల ఏదో భయం, బెరుకు మనల్ని వెంటాడుతూ స్వేచ్ఛగా జీవించకుండా అడ్డుపడుతూ ఉంటాయి. ఉదాహరణకు.. మీకు పాటలంటే చాలా ఇష్టం.. మీ గొంతు కూడా చాలా శ్రావ్యంగా ఉంటుంది. కానీ ఎవరిముందైనా పాడమంటే మాత్రం చాలా భయం. దీనివల్ల మీకున్న అవకాశాలను కోల్పోవడమే కాదు.. మీలోని ప్రతిభను నలుగురికీ చూపే అవకాశాన్నీ చేజార్చుకుంటారు. దీనికి బదులుగా కొద్దిగా ధైర్యం తెచ్చుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోతే విజయం మీ వెంటే ఉంటుంది. అయితే దారిలో అపజయాలు ఎదురైనా సరే మనోధైర్యంతో ముందుకు సాగాల్సి ఉంటుంది. దీనివల్ల స్వేచ్ఛగా మన జీవితంలో ఏం చేయాలనుకుంటున్నామో అవన్నీ చేసే అవకాశం మనకు లభిస్తుంది.మీరు నిజంగా ఎవరిమీదా ఆధారపడకుండా.. స్వతంత్రంగా జీవించాలంటే మీ సంపాదన మీకే ఉండాలి. అయితే సంపాదించే డబ్బును విచ్చలవిడిగా కాకుండా అవసరమున్న సందర్భాల్లో జాగ్రత్తగా ఖర్చు పెట్టడం నేర్చుకోవాలి. అంతేగానీ మా డబ్బు.. మా ఇష్టం.. దేనికైనా ఖర్చు పెట్టుకుంటామంటే.. భవిష్యత్తు అవసరాలకు డబ్బు మిగలదు. దీనివల్ల ఇతరులపై ఆధారపడే పరిస్థితులు ఎదురుకావచ్చు. ఇలా ఇతరుల మీద ఆధారపడటం వల్ల స్వతంత్రం లేకుండా పోయే సందర్భాలు కూడా ఎదురవుతాయి. అందుకే ఎవరి మీదా ఆధారపడకుండా మన భవిష్యత్తుకు తగ్గట్టుగా మనమే ప్లాన్ చేసుకొని పొదుపు చేస్తే ఆర్థికంగానూ ఎవరిమీదా ఆధారపడకుండా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో జీవించగలుగుతాం.ఎవరితో అయినా సరే.. భయపడకుండా మనసులోని భావాలను స్వేచ్ఛగా వెల్లడించే గుణం అలవాటు చేసుకోవడం మంచిది. ఇతరులతో మాట్లాడటానికి భయపడితే మనలోని భావాలన్నీ లోపలే మిగిలిపోతాయి. అలా భావాలన్నీ గూడుకట్టుకొని మిగిలిపోయినప్పుడు జీవితంలో అసంతృప్తి మాత్రమే మిగులుతుంది. ఒక్కోసారి కెరీర్లో కొన్ని చక్కటి అవకాశాలను కూడా కోల్పోవాల్సి రావచ్చు. మీ జీవితం అలా కాకుండా ఉండాలంటే ఎంతమంది ముందైనా మీ మనసులోని మాట చెప్పడానికి వెనకడుగు వేయొద్దు. ఎదుటివారు మీకంటే వయసులోనో, హోదాలోనో పెద్దవారని భయపడాల్సిన అవసరం లేదు. మీ అభిప్రాయాలు తప్పు కానంతవరకూ మీరు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. అలాగే ఇతరులు మీ మీద అభాండాలు వేస్తున్నప్పుడు మిమ్మల్ని మీరు కాపాడుకోవడం కూడా మర్చిపోవద్దు.మీకు నచ్చిందే..స్వతంత్రంగా బతకడానికి మంచి నడవడిక, విద్యాబుద్ధులు కూడా చాలా అవసరం. వీటివల్ల భవిష్యత్తుకు ఉపయోగపడే నైపుణ్యాలు అలవడతాయి. అలాగే ప్రపంచంలో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవడమూ ముఖ్యమే. ఇవన్నీ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు దోహదపడతాయి. అయితే చదువు, ఉద్యోగం విషయంలో వేరొకరి మీద ఆధారపడి నిర్ణయాలు తీసుకోవద్దు. మీ మనసు చెప్పిన రంగాన్ని ఎంచుకోవడం వల్ల ఆ వృత్తిలో మీరు ఉన్నత స్థానాలకు ఎదగగలుగుతారు. అలా కాకుండా ఎవరో చెప్పారని మీ కెరీర్‌ని ఎంచుకుంటే మీకు నచ్చని వృత్తిలో మిగిలిపోవాల్సి రావచ్చు..మీరే బెస్ట్!మీ మనసు స్వతంత్రంగా ఆలోచించాలంటే మిమ్మల్ని మీరు ఇంకొకరితో పోల్చుకోవడం మానేయాలి. ఒకరితో పోల్చుకుంటూ ఉండటం వల్ల వాళ్ల దగ్గర ఉన్నదాన్నే మనసు కోరుకుంటూ ఉంటుంది. జీవితంలో మీకు ఎందులో అసలైన ఆనందం లభిస్తుందో మీ మనసు మీకు సూచించలేకపోతుంది. అందుకే ప్రతి విషయంలోనూ మీరే బెస్ట్ అనుకోండి. ఇతరులతో పోల్చుకోవద్దు. నెగెటివ్ ఆలోచనలను మీ దరిదాపుల్లోకి కూడా రానివ్వద్దు. ఇతరులతో పోలిక వల్ల అసూయ, ద్వేషం లాంటి నెగెటివ్ ఫీలింగ్స్‌కి మీరు దగ్గరవుతారు. అందుకే మీలో ఉన్న మంచి లక్షణాలను తెలుసుకోండి. ఏదైనా సందర్భంలో ఇతరులతో పోల్చుకున్నా దాన్ని నెగెటివ్‌గా కాకుండా పాజిటివ్‌గా తీసుకొని వారిలోని మంచి గుణాలను మీరూ అలవర్చుకోవడానికి ప్రయత్నించండి. దీనివల్ల మీ మనసు ప్రశాంతంగా, స్వేచ్ఛగా ఉంటుంది.

## మీ వయసు ప్రకారం రోజుకు ఎన్ని కేలరీలు తినాలో తెలుసా.. ఈ చార్ట్ చూడండి..



నిత్యం ఆరోగ్యంగా ఉండేందుకు బరువును అదుపులో ఉంచుకోవడం ఎంత అవసరమో.. రోజూ శరీరానికి సరిపడినంత తినటమూ ఎంతో ముఖ్యం. మనం తినే ఆహారంలో ఏ స్థాయిలో కేలరీలు ఉన్నాయని మనం గమనించుకున్నప్పుడే ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత ఏర్పడుతుంది. అంతే కానీ, చిన్నపిల్లల్లాగా అరకొరగా తింటూ ఆకలి చంపుకున్నారో లేని పోని అనర్థాలు రావడం ఖాయం. వయసు మారేకొద్దీ ప్రతి ఒక్కరూ రోజూవారీ తీసుకోవాల్సిన కేలరీల మోతాదు మారుతుందనే విషయం తప్పక గుర్తుంచుకోండి. ఈ చార్ట్ ఫాలో అయ్యి ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకోండి.ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకునే కేలరీలను కేలరీలు తీసుకోవడం, ఖర్చు చేయడంలో సమతుల్యత పాటించడం చాలా ముఖ్యం. మనం ఖర్చు చేసే దానికంటే ఎక్కువ కేలరీలు తీసుకుంటే అదనపు కొవ్వు నిల్వలు తయారయ్యే ప్రమాదముంది. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. వ్యక్తుల వయస్సు, జెండర్, బరువును బట్టి రోజువారీ కేలరీల అవసరాలు మారుతూ ఉంటాయి. అందువల్ల, డైటీషియన్ సలహా ప్రకారం సమతుల్య ఆహారం ద్వారా కావాల్సినంత కేలరీలు మాత్రమే తీసుకోండి. కేలరీలు అంటే ఏమిటి..కేలరీలు అంటే ఆహారంలో లభించే శక్తి. మనం తినే ప్రతిదానిలో కేలరీలు ఉంటాయి. ఉదాహరణకు 100 గ్రాముల బియ్యం 156 కేలరీలు,30 గ్రాముల బాదం 169 కేలరీలు, 100 గ్రాముల చీజ్ 282 కేలరీలు కలిగి ఉంటాయి.రోజువారీ కేలరీల అవసరాలను అంచనా వేయడం :డేటా విశ్లేషణ ఆధారంగా జీవనశైలిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు:నిశ్చల జీవనశైలి : తక్కువ శారీరక శ్రమ కలిగిన వ్యక్తులు అంటే ఎక్కువ సమయం కూర్చుని లేదా పరిమితంగా నడిచేవారు.మధ్యస్థంగా చురుకైన జీవనశైలి: చురుకైన జీవనశైలి జాబితాలో మితంగా నడవడం, తేలికపాటి శారీరక శ్రమ లేదా ఇంటి పనులు చేసేవారు ఉంటారు.చురుకైన జీవనశైలి:అత్యంత చురుకైన జీవనశైలి వర్గానికి చెందిన వారు అధిక స్థాయిలో పనులు చేస్తారు. ఇలాంటి వారు క్రమం తప్పకుండా వ్యాయామం, తరచుగా నడవడం వంటి వాటిని తమ దినచర్యలలో తప్పక భాగం చేసుకుంటారు.పైన చార్ట్‌లో ఇచ్చిన కేలరీల సిఫార్సులు ఆరోగ్యకరమైన బరువు ఉన్న వ్యక్తులకు వర్తిస్తాయి. ఒకవేళ మీరు బరువు పెరగాలంటే సిఫార్సు చేసిన మొత్తం కంటే అదనంగా 500 కేలరీలు తీసుకోండి. బరువు తగ్గాలంటే సూచించిన మొత్తం కంటే 500 కేలరీలు తక్కువగా తినాలని లక్ష్యంగా పెట్టుకోండి. మీ నిర్దిష్ట అవసరాలు, ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా డైటీషియన్‌ను సంప్రదించి వ్యక్తిగత సలహా పొందేందుకు ప్రయత్నిస్తే మరీ మంచిది.

# పలు రైస్ మిల్లులను సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్



మహబూబాబాద్/కేసముద్రం /ఆగస్ట్ 2/అక్షరం న్యూస్ :-జిల్లా అదనపు కలెక్టర్ మహబూబాబాద్ జిల్లాలోని రైస్ మిల్లుల తనిఖీ మరియు సీఎంఆర్ త్వరితగతిన మిల్లింగ్ చేసి డెలివరి చేయుటకు ఆదేశించిన దాని గురించి.మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం కి సంబందించిన మిల్లులను 1)ఓం సాయి ఆగ్రో ఇండస్ట్రీస్ 2)శ్రీ శివ రామ రైస్ ఇండస్ట్రీస్ మరియు కేసముద్రం గిడ్డంగిని సందర్శించి మిల్లులలో దిగుమతి అయిన వరి ధాన్యం రబీ 2024-25 కు సంబంధించి నిల్వలను మరియు సీఎంఆర్ పెట్టిన దాని గురించి తనిఖి చేసి రైస్ మిల్లర్లకి సీఎంఆర్(బియ్యం)త్వరితగతిన పెట్టుటకు ఆదేశాలు ఇవ్వటం జరిగింది.అదేవిధంగా ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ తో పాటుగా పౌర సరఫరాల అధికారి మరియు జిల్లా మేనేజర్,పౌర సరఫరాల సంస్థ పాల్గొనటం జరిగింది.

# వనవాసీ సేవలు అమోఘం

- ఆదివాసీ విద్యార్థుల క్రమశిక్షణ ఎంతో ఆకట్టుకుంది
- ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రీదర్



భద్రాద్రి కొత్తగూడెం/చర్ల ఆగస్టు 2/ అక్షరం న్యూస్:-పేద ఆదివాసీ విద్యార్దులకు వనవాసీ కళ్యాణ పరిషత్ అందచేస్తున్న సేవలు అమోఘమని కొయ్యూరు ప్రాదమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ శ్రీదర్ అన్నారు. శనివారం చర్ల లోని వనవాసీ కొమరం భీం విద్యార్ది నిలయం కు పలువురు దాతలు వితరణ లను అందచేసారు. వనవాసీ కమిటి సభ్యుడు, శ్రీ సీతారామ ఆయిల్ బంక్ మేనేజర్ శివరాజు కిషోర్ - సంతోషి దంపతుల కుమారుడు కార్తికేయ జన్మదినం సందర్భంగా 25 కేజీల బియ్యం, పండ్లు, స్వీట్స్ అందచేసారు. ప్రభుత్వం ఉపాద్యాయుడు శివరాజు రవికుమార్ తన తండ్రి శివరాజు ఆంజనేయులు జ్ఞాపకార్థం విద్యార్థుల వినోదం కొరకు ఏడాది పాటు టివి వీక్షించేందుకు ఎయిర్ టెల్ నెట్‌వర్క్ రీచార్జ్ చేసారు. ఎలక్ట్రీషియన్ పెదిరెడ్డి రమేష్ జ్ఞాపకార్థం కుమారుడు పెదిరెడ్డి విక్రం కుమార్ - హారిక దంపతులు 50 కేజీల బియ్యం, పండ్ల ను వితరణగా అందజేసారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన డాక్టర్ శ్రీదర్ మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థుల క్రమశిక్షణ తనను ఎంతో ఆకట్టుకుందని అన్నారు. విద్యార్థులు శ్లోకాలను ఆలపించిన తీరు అమోఘమని ప్రశంసించారు. దాతలు ఇటువంటి పేద విద్యార్దుల అభ్యున్నతి వితరణ లను అందచేయడం అబినందనీయమని అన్నారు. విద్యార్దులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగ పరుచుకొని ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వనవాసీ నిలయ కమిటీ అద్యక్షుడు తాటి పాపారావు ఉపాధ్యక్షులు జవ్వాది మురళీకృష్ణ, కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శివరాజు కిషోర్ సంతోషి, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ఆశా కార్యకర్త ఉషారాణి, పెదిరెడ్డి హారిక పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితక్క నిరాహార దీక్షను జయప్రదం చేయండి

**యుపిఎఫ్ కోకన్వీనర్ కోరిగా నర్సింహులు**




జనగామ జిల్లా/ రఘునాధపల్లి /( అక్షరం న్యూస్ ) ఆగస్టు 02:

తెలంగాణ జాగృతి యునైటెడ్ పూలే ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించేందుకు బీసీ బిల్లు ద్వారా 42 శాతం రిజర్వేషన్ కోసం ఈనెల 4, 5. 6. 7 తేదీలలో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో చేపడుతున్న 72 గంటల నిరాహార దీక్షను బీసి మద్దతు తెలిపి విజయవంతం చేయాలని యునైటెడ్ పూలే ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ గొరిగే నరసింహ కురుమ, గొప్పు, సదానందం, తెలంగాణ జాగృతి జనగామ జిల్లా అధ్యక్షులు పసునూరి మురళీలు పిలుపునిచ్చారు. శనివారం జనగామ జిల్లా కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా యుపిఎఫ్ కో కన్వీనర్ కోరిగా నరసింహులు కురుమ మాట్లాడుతూ కవితక్క బీసీల కోసం ఉద్యమం చేస్తుంటే కావలసికొని అడ్డుపడాలని చాలామంది చూస్తున్నారని వారికి వీలైతే బీసీలకు న్యాయం జరగాలని చూసినట్లయితే, కాంగ్రెస్, బిజెపి నాయకులు తక్షణమే కవితక్క చేసే దీక్షకు మద్దతు ఇచ్చి వారి యొక్క నిజరూపాన్ని నిరూపించుకోవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు పసునూరి మురళి మాట్లాడుతూ, కవితక్క బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం కోసం తాను ఎల్లవేళలా కష్టపడుతూ ముందుకు సాగుతున్న తరుణంలో కొంతమంది. ఓర్వలేక చూడలేక తప్పుడు ప్రచారాలు తప్పుడు నిందలు వేస్తున్నారు. కానీ ఎన్ని చేసినా బీసీ బిల్లు పెట్టే వరకు కవితక్క పోరాటం ఆపదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా నాయకులు రేఖ, వంకుడోతు అనిత, జాగృతి జిల్లా నాయకులు అనంతుల ఆంజనేయులు, చిదురాల రాజు, కావేరి వినయ్, కన్నోజు రాజేందర్, నగర కిషన్ గౌడ్, కలకుంట్ల శ్రీనివాస్ గౌడ్, మన్యం సత్య, ఎండి అతిక్ పాషా, కండె సతీష్, కరిగి కరుణాకర్, ఎంటే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రేషన్ కార్డులు : వైస్ చైర్మన్ పరమేష్ పటేల్



మద్నూర్ ఆగష్టు 02 (అక్షరం న్యూస్ -కామారెడ్డి )

కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం మొఘ గ్రామంలో అర్హులై మంజూరైనా రేషన్ కార్డు స్లిప్పులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ పంపిణి చేశారు. శనివారం రోజున గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామానికి సంబందించిన మంజూరైనా రేషన్ స్లిప్పులు అందజేశారు. రేషన్ స్లిప్పులు అందుకున్న ఆయా కుటుంబ సభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనకు హర్షం వ్యక్తం చేశారు. జుక్కల్ ఎమ్మెల్యే కాంతారావు కు గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రత్యక ధన్యవాదములు తెలిపారు. రేషన్ స్లిప్పులు పంపిణి కార్యక్రమం లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి ప్రజలకు నూతన రేషన్ కార్డులు రాక వారి సంక్షేమనికీ ఆటంకం కలిగిందని తెలిపారు. గత ప్రభుత్వం పేదలకు, గ్రామ స్థాయి ప్రజలకు ఎలాంటి లబ్ది చేకూర్చా లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఆధానముగా సంక్షేమ పథకాలు లబ్ది చేకూర్చుడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జుక్కల్ ఎమ్మెల్యే కాంతారావు గ్రామ గ్రామాన సిసి రోడ్డు అభివృద్ధి పనులు, పేద వారికి ఇంటి లేని వారికి ఇందిరమ్మ పేరు మీద డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణం కొరకు 5 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్న విషయాన్నీ తెలిపారు. గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే రేషన్ కార్డులు లేని వారికి అర్హులైన వారందరికీ నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వం పాలనకు నిదర్శనం అనీ తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే నియోజక వర్గం విద్యా అభివృద్ధి కొరకు విద్యా హాబ్ గా ఇంటిగ్రేడ్ గురుకుల విద్యాలయం మంజూరు చేసి ఇవ్వడం ఎమ్మెల్యే కాంతారావు పని తీరుకు నిదర్శనం అనీ తెలిపారు. ఎమ్మెల్యే సహకారం తో ఉమ్మడి మండలాన్ని అభివృద్ధి చేస్కోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో మద్నూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, మాజీ ఎంపీటీసి హన్మంత్ పటేల్, సంగ్రామ్ పటేల్, మల్లు గొండ, రవి కిరణ్, సాయి పటేల్, గంగాధర్, రేషన్ కార్డు లబ్దిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# మేడిపల్లిలో రైతుల ఆసక్తికరంగా పీఎం కిసాన్ 20వ విడత కార్యక్రమం వీక్షణ



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఆగస్టు రెండో పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి నుండి దేశవ్యాప్తంగా రైతులకు లబ్ధి చేకూర్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడతను అధికారికంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని రామగుండం మండలంలోని మేడిపల్లి రైతు వేదిక వద్ద స్థానిక రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం ద్వారా రైతులకు నేరుగా నిధులు వారి ఖాతాల్లో జమ అవుతుండడం గమనార్హం.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి గారు వ్యవసాయ అభివృద్ధికి సంబంధించి చేపట్టిన పలు ప్రధాన పథకాల గురించి వివరించారు. ఎఫ్‌పీవోల ద్వారా మార్కెట్ సదుపాయాల పెంపు,కిసాన్ మాన్ ధన్ యోజన ద్వారా రైతులకు పింఛన్ హామీ,సాయిల్ హెల్త్ కార్డులు ద్వారా భూసారంపై అవగాహన,కిసాన్ క్రెడిట్ కార్డులు ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు,పీఎం ఫాసల్ భీమా యోజన ద్వారా పంటల భీమా,ఇ-నామ్ ద్వారా దేశవ్యాప్తంగా మార్కెట్ యాక్సెస్,జల శక్తి అభియాన్ ద్వారా సాగునీటి వనరుల అభివృద్ధి వంటి అంశాలు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ప్రధాని ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షించగా, పథకాలపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమమే దేశ అభివృద్ధికి ఆధారమని ప్రధానమంత్రి గారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె. ప్రకాష్, వ్యవసాయ విస్తరణ అధికారి కే. శ్రీకాంత్ తో పాటు అనేకమంది రైతులు పాల్గొన్నారు.

# మద్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్లాసులు ప్రారంభం



మద్నూర్ /ఆగస్ట్ 02 (అక్షరం న్యూస్ -కామారెడ్డి )

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండల కెంద్రంలోని నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్లాసులు ప్రారంభం కావడం జరిగిందని ప్రిన్సిపాల్ అశోక్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. మద్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు క్రమం తప్పకుండ క్లాసులకు హాజరు కావాలని తెలిపారు. అనుభవం కలిగిన లెక్చరర్ల ద్వారా డిగ్రీ ఆయా సబ్జెక్టులను చెప్పడం జరుగుతుందని తెలిపారు. ప్రతి రోజు డిగ్రీ కాలేజీకి వచ్చి లెక్చరర్లు చెప్పిన పాఠ్య పుస్తక జ్ఞానం క్రమ శిక్షణ తో ఆస్వాదించాలని కోరారు. కనీసం 75 % శాతం విద్యార్థులు హాజరై ఉండాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కలశాలలో ప్రవేటు కంటే నాణ్యమైన పాఠ్య పుస్తక జ్ఞానం తో పాటు విద్యార్థులకు పోటీతత్వ లక్షణాలు స్కిల్స్ కల్పించడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దారస్వార్ సాయిలు మాట్లాడుతూ మద్నూర్ కేంద్రంలో డిగ్రీ కళాశాల ప్రారంభం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తప్పకుండ ఉన్నత డిగ్రీ విద్యా క్లాసులు హాజరు కావాలని కోరారు. జుక్కల్ ఎమ్మెల్యే కాంతారావు సహకారం తో డిగ్రీ కళాశాల అభివృద్ధి కొరకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దారస్వార్ సాయిలు, లెక్చరర్ల బృందం సభ్యులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోడీ శ్రావణ దృశ్య ప్రత్యక్ష ప్రసారం తిలకించిన రైతులు



ఓదెల/ పెద్దపల్లి ఆగస్టు 02(అక్షరం న్యూస్)

ఓదెల మండలం పొత్కపెల్లి రైతు వేదికలో పీఎం కిసాన్ 20 విడత నిధుల కార్యక్రమం ఏఈఓ మౌనిక ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉత్తర ప్రదేశ్ లోని వారణాసి నుండి దేశవ్యాప్తంగా 20 వ విడత నిధులు విడుదల చేస్తున్న సందర్భంగా శ్రావణ దృశ్య ప్రత్యక్ష ప్రసారం రైతు వేదికల నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి పోత్కపల్లీ గ్రామ రైతులు.నాయకులు పుల్లూరి పృథ్వీరాజ్ రెడ్డి శంకర్. భూషణవేణి సత్యనారాయణ.. మెడగొని రమేష్ శనిగారపు రవీందర్. గొడుగు బిక్షపతి పిట్టల అంజయ్య అనిల్ తదితరులు పాల్గొన్నారు

## రైతులకు అందుబాటులో సాంకేతిక పరిజ్ఞానం

- రైతులు ఆర్థికంగా లబ్ధి పొందాలన్నదే నా లక్ష్యం
- వీరాయపాలెంలో 'అన్నదాత సుఖీభవ' ప్రారంభించిన చంద్రబాబు



ఒంగోలు,ఆగస్ట్2(: (అక్షరం న్యూస్)

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రైతు రాజుగా మారాలి. ఎన్ని కష్టాలు ఉన్నా.. ప్రజలు సుఖసంతోషాల తో ఉండాలనేది నా ఆకాంక్ష. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ పథకాలతో పేదలను గట్టెక్కించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వీరాయపాలెంలో 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన అనంతరం.. పొలాల వద్ద వినూత్నంగా ఏర్పాటు చేసిన వేదికపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల చెప్పిన సమస్యలపై స్పందించిన సీఎం.. వాటిని పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులు 'అన్నదాత సుఖీభవ' ద్వారా లబ్ధి పొందనున్నారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీనికి తోడుగా కేంద్రం 'పీఎం కిసాన్' పథకం కింద మొదటి విడతగా రూ.2 వేల చొప్పున రైతులకు సాయం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఒక్కో రైతుకు రూ.7 వేలు చొప్పున జమ చేశాయి. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందించనున్నారు. ఇకపోతే గత ప్రభుత్వం వితంతు పింఛన్లు రద్దు చేసింది. మా ప్రభుత్వం రాగానే వితంతు పింఛన్లు మళ్లీ తీసుకొచ్చాం. లబ్ధిదారులు ఎక్కడుంటే .. అక్కడే పింఛన్ ఇస్తున్నాం. పింఛన్ల కోసం ఏడాదికి తెలంగాణ రూ.8వేల కోట్లు- ఖర్చు చేస్తుంటే.. ఏపీ రూ.32వేల కోట్లు- వెచ్చిస్తోంది. ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం. రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. దీంతో దాదాపు రూ.2.62 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందుతారని సీఎం వివరించారు. ఎన్నికల ముందు అరాచక, దుర్మార్గపు పాలన నడిచింది. 2019లో చేసిన తప్పిదం వల్ల ప్రజల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు- చీలకూడదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంచి ఉద్దేశంతో ముందుకొచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా జాతీయ పార్టీ భాజపాతో పొత్తు పెట్టుకున్నాం అనిచంద్రబాబు ఇవరించారు. ప్రజలకు హాని జరగకుండా ఉగ్రవాదులను మట్టుబెట్టాం. అభివృద్ధి చేయడం తెలిసిన పార్టీ తెదేపా అన్నారు. నిరంతరం ప్రజలతో మమేకమై పాలన సాగిస్తున్నామని అన్నారు. కేంద్రంలో భాజపా నాలుగోసారి కూడా అధికారం లోకి వస్తుందని, మోడీ పనితనమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా మోడీ హవా పెరుగుతోందన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మోడీ స్వదేశీ వస్తు నినాదం

- ఇతర దేశాలపై ఆధారపకుండా సాగాలి
- ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు



వారణాసి,ఆగస్ట్2 ((అక్షరం న్యూస్)

భారత్ కూడా అతి త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారనుందని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోడీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన చేసిన విమర్శలపై భారత ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితిన నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయోజనాలపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర

ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంకట్టాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఇటీవల భారత్-రష్యా బంధంపై ట్రంప్ స్పందిస్తూ.. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చు కోనీయండని, కలిసి మునగనీయండని విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూదిల్లీపై 25శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యాధినేత.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తే అదనంగా పెనాల్టీలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే మోదీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఎదురుదాడితో...అక్రమాలను దాచలేము !



**హైదరాబాద్, ఆగస్ట్2 :** (అక్షరం న్యూస్)

ఎదురుదాడి రాజకీయాల్లో ఇప్పుడు బిఆర్ఎస్, ఎపిలో వైకాపాలు ఆరితేరాయి. చేసిన తప్పులు, అప్పుల గురించి ఎవ్వరూ చర్చించుకోవద్దన్న పాలసీతో వీరు ఎదుటివారిపై బురదజల్లాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇద్దరూ ఒకే గూటి పక్షులుగా ఉన్నారు. ఎపిలో అప్పులు చేసి, బటన్ నొక్కుళ్లతో రాష్ట్రాన్ని దివాళా తీయించి, సొంత ఖజానా నింపుకున్న ఘనుడు జగన్. తెలంగాణలో కూడా కుటుంబం గుప్పిట్లో అధకారం పెట్టుకుని రాష్ట్రాన్ని దివాళా తీయించిన ఘనత కెసిఆర్ కుటుంబానిది. అంతేగాకుండా లెక్కకు మిక్కిలి అప్పులు చేసి ఇప్పుడేమో....మాకా సంగతే తెలియదన్న రీతిలో పోజులు పెడుతున్నారు. కెటిఆర్, హరీష్ రావుల విమర్శలు చూస్తుంటే సిగ్గేస్తోంది. జాలి కలుగుతోంది. ఎందుకంటే చేసిన తప్పులన్నీ చేసి, మళ్లీ తమదే అధికారం కనుక ఇవేవీ బయటపడవన్న ధీమాతో ఉండిపోయారు. కానీ ప్రభుత్వం మారడంతో అప్పులు, తప్పులు బయటకు తన్నుకు వస్తున్నాయి. వీటిని కప్పిపుచ్చుకునేందుకు రోజుకో అంశంపై విమర్శలు చేస్తున్నారు. గురుకులాలు, హాస్టళ్లు, రైతులు, బనకచర్ల, విద్యుత్ పంపిణీ తదితర అంశాలపై వీరు చేస్తున్న విమర్శలు అన్నీ ఇన్నీ కావు. నిజంగానే పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఇవన్నీ బాగావుంటే, బాగుచేసివుంటే ఇప్పుడే పాపం ఎందుకు బద్దయలయ్యిందన్నది ప్రజలు ఆలోచించాలి. అన్నింటికి మించి కాళేశ్వరంలో లక్షకోట్లు తగలేశారు. వారికి రావాల్సిన ముడుపులు రావడంతో ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇవన్నీ ప్రజలు చర్చించుకోవద్దన్న భావనలో రోజూ బనకచర్లను ముందుకేసి విమర్శలు చేస్తున్నారు. సిఎం ప్రజల్లోకి రావడమెందుకు, ఆయన ప్రజలను కలవాల్సిన పనేముందని వాదించిన కెటిఆర్ ఇప్పుడు పనిచేసే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాడు. నవ్విపోదురు నాకేంటి అన్న చందంగా కెటిఆర్,హరీష్ రావుల విమర్శలకు హద్దూపద్దూ లేకుండా పోతోంది. అలాగే జగన్ తీరు కూడా అలాగే ఉంది. వీరు దోచుకోవడం అన్న స్కూళ్లో శిక్షణ పొంది వచ్చినవారు. ఇక కాళేశ్వరం నివేదిక చూస్తే ఆశ్చర్యం కలగమానదు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో లోపాలు, వైఫల్యాల్లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాత్ర కీలకమని జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ తేల్చింది.ఈ విషయంలో ఆయన పాత్ర విస్మరించలేనిదని స్పష్టం చేసింది. ఆయనతోపాటు ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తమ బాధ్యతలను సరిగా నిర్వర్తించలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అంతేకాకుండా.. అప్పటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్‌సీలుగా పనిచేసినవారు, మరికొందరు అధికారులను కూడా వైఫల్యాలకు బాధ్యులుగా పేర్కొంటూ నివేదిక రూపొందించింది. బ్యారేజీల నిర్మాణానికి మంత్రివర్గ ఆమోదమే తీసుకోలేదని తెలిపింది. బ్యారేజీలపై ముందుగానే నిర్ణయం తీసుకొని.. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదన్న సీడబ్ల్యూసీ నివేదికను కేవలం సాకుగా చూపించారని వెల్లడించింది. పైగా బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ భౌతిక పరీక్షలను శాస్త్రీయ ప్రమాణాలతో జరపలేదని పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక ఇవ్వగా.. దానిని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తీసుకోలేదని, మంత్రివర్గ ఉపసంఘం వేసినా.. దీనికి, ఆ బ్యారేజీలకు సంబంధమే లేదని పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని తెలుస్తోంది. వీటి గురించి కెటిఆర్ మాట్లాడరు. హరీష్ రావు మాట్లాడరు. నోరుంది కదాని తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నాల్లో ఈ ఇద్దరూ ఆరితేరారు. అయితే మంత్రివర్గ ఆమోదంతోనే బ్యారేజీలు నిర్మించినట్లు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ

మంత్రులు టి.హరీశ్‌రావు, ఈటల రాజేందర్ చెప్పడం ఇంకా మోసం చేయడం తప్ప మరోటి కాదు.

ఒక ఉద్యమ పార్టీగా ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేయకుండా వారి నమ్మకాన్ని దెబ్బతీసింది. ఒక కుటుంబానికి వ్యాపార సామ్రాజ్యంగా మారిందనడానికి కాళేశ్వరం సహా అనేక ఉదాహరణలు ఉన్నాయి. గొర్రెల పంపిణీలో వేయికోట్ల మోసం అంటే ఎంత దారుణమో గుర్తించాలి. ఒక ఉద్యమ పార్టీ ఎంతగా అహంకారంగా ప్రవర్తించిందో చూసాం. ప్రజలు ఎలా మోసపోయారో చూసాం. ఇందుకు కాళేశ్వరం, గొన్నెలు, చేపలు, రైతుబంధు వంటి అన్ని పథకాలు చూడవచ్చు. సిఎం రిలీఫ్ ఫండ్ పేరుతోనూ మోసాలు సాగించారు. ఇప్పుడు బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక అనవసరంగా గట్టిగా రంకెలు వేస్తోంది. ఒక్కో అవినీతి బయటపడ్డా కొద్దీ జీర్ణించుకోలేక పోతున్నది. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి కుటుంబం, ప్రతి యువకుడి ఆశయాల మీద చేసిన మోసపూరి రాజకీయం బహుశా చరిత్రలో ఎవరూ చేసివుండరు.

ఒక నాయకుడు తప్పు చేస్తే దాన్ని ప్రజల ముందుకు తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ ఇక్కడ పార్టీతో పాటు,ఓ కుటుంబం మోసం చేసింది.అయినా పదేళ్లుగా మీడియా ఈ విషయం ప్రసారం చేయలేదు. దాన్ని ఇప్పుడైనా ప్రశ్నించాలి. మీడియా స్వేచ్ఛను అణచివేయాలని చూసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు. ప్రజాస్వామ్యంలో అది క్షమించదగినది కాదు. అసలు బీఆర్ఎస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నమ్ముకుని అమ్ముకోవడమెలాగో నేర్చింది. ఇన్న తప్పులకు కారణమైన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేస్తున్న విమర్శలు...దగుల్బాజీ రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. నిరాశా నిస్పృహల్లో ఉంటూ ప్రస్తుత పరిస్థితిని చూసి తట్టుకోలేని మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అందుకే అసందర్భ ప్రేలాపనలు చేస్తున్నారు. రాజకీయాల్లో నీతిగా మాట్లాడటం బిఆర్ఎస్, వైకాపా నాయకులకు రాదు. వీరు పాలనార్హత లేనివారు. ప్రజల తీర్పును గౌరవించలేక, దాన్ని హేళన చేయడమంటే అది ప్రజలను నిందించడమే అవుతుంది.

# మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని మత్స్య శాఖ మంత్రి వాకిడి శ్రీహరి ముదిరాజ్‌కి విన్నవించిన పెద్దపల్లి జిల్లా డైరెక్టర్

ఓదెల/ పెద్దపల్లి ఆగస్టు 02(అక్షరం న్యూస్)

మత్స్యకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకిడి శ్రీహరి ముదిరాజును పెద్దపెల్లి జిల్లా మత్స్య పరిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్లు వినతి పత్రం ఇచ్చారు శనివారం హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిడి శ్రీహరి ముదిరాజును మత్స్య పరిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్లు కలిసి పలు సమస్యల పై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ ముఖ్యం గా తెలంగాణ ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లల పంపిణీ గత ఏడాది నాసిరకం ఉండడం తో' మత్స్య కార్మికులు నష్టపోయారని అదేవిధంగా అనేక మెరిగే విపరీతంగా చేరి చేపలను అభివృద్ధి కాకుండా చేసిందని అదేవిధంగా ఆ చేప పిల్లలతో బుర్కా అనే చేప రావడంతో మత్స్య కార్మికులకు చాలా అన్యాయం జరిగిందని ఆ బుర్కా చాపలను వేయకుండా చేస్తుందని దానివల్ల మత్స్య కార్మిక కుటుంబాలు చాలా నష్టపోయాయని అలాంటిది మళ్లీ పునరావతం కాకుండా చూడాలని అదేవిధంగా ఉచితంగా వచ్చిన చేప పిల్లలను చాలా ఆలస్యంగా ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎవరు తీసుకోకుండా వెనుకకు పంపించడం జరిగిందని ఈ యేడాది అయిన నాణ్యమైన పెద్ద చేప పిల్లలను సరైన సమయంలో అందించాలని అన్నారు. మత్స్య కార్మికులకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో పలు నూతన సంక్షేమ పథకాలను సబ్సిడీపై మోటార్ వాహనాలు వలలు పడవలు ప్రవేశ పెట్టి మత్స్యకారులకు తోడుగా ఉండాలని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి వాకిడి శ్రీహరి ముదిరాజును కోరమన్నారు. మా సమస్యలను విన్న

మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. గత యేడాది లాగ జరిగిన తప్పులు ఈసారి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుం టానని హామీ ఇచ్చారన్నారు. మత్స్య కార్మికులకు కొత్త పథకాలు పెట్టి ప్రోత్స హిస్తామని హామీ ఇవ్వడం శుభ పరిమాణమని వారు పేర్కొన్నారు. అదేవిధంగా నీలం





మధు ముదిరాజులు కూడా కలవడం జరిగిందని తప్పకుండా మత్స్య కార్మికుల సమస్యలపై స్పందించి న్యాయం జరిగేలా చూడాలని కోరడం జరిగిందని అన్నారు . ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా డైరెక్టర్లు చెట్ల శ్రీనివాస్ ముదిరాజ్ పోతరవేని క్రాంతి కుమార్ ముదిరాజ్, అయిలావెని వీరాస్వామి, ముదిరాజ్ పెద్దపల్లి సుజాత పోచయ్య, ముదిరాజ్ , తాళ్ళ తిరుపతి ముదిరాజ్, రేళ్ళ కోటయ్య, ముదిరాజ్ బోయిరి శ్రీకాంత్, ముదిరాజ్ పొలవేని మొండయ్య ముదిరాజ్ తో పాటు ఓదెల మండల, మాజీ వైస్ ఎంపీపీ పిట్టల రవి కుమార్ పాల్గొన్నారు.

# అవార్డు గ్రహీతలకు చిరంజీవి శుభాకాంక్షలు



71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఏడు కేటగిరీల్లో తెలుగు సినిమాకు అవార్డులు వరించాయి. బాలకృష్ణ కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'భగవంత్ కేసరి' చిత్రం 'ఉత్తమ ప్రాంతీయ తెలుగు చలనచిత్రం' అవార్డును గెలుచుకుంది. అలాగే ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సోషియో ఫాంటసీ 'హను-మాన్'.. ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ విభాగం లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. 'బేబీ'కి బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ సింగింగ్ అవార్డులు దక్కాయి. ఉత్తమ బాలనటి కేటగిరిలో 'గాంధీతాత చెట్టు-' సినిమా నుంచి సుకృతివేణి అవార్డుకు ఎంపికైంది. తెలుగు చిత్రాలు సత్తా చాటిన నేపథ్యంలో పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి తన సోషల్ మీడియాలో జాతీయ అవార్డ్ గ్రహీతలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్ చేశారు. 'తెలుగు టాలెంట్, తెలుగు సినిమాలు ఈసారి పదికి పైగా విభాగాల్లో అవార్డులు గెలుచుకోవడం చూసి ఎంతో గర్వంగా ఉంది.. ' అంటూ పోస్ట్ లో పేర్కొన్నారు. అలానే బాలయ్య నటించిన భగవంత్ కేసరి చిత్ర బృందానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే తన పోస్ట్‌లో అవార్డులు గెలుచుకున్న వారికి సంబంధించిన లిస్ట్ కూడా పెట్టారు. తెలుగు సినిమా విజేతలకు ప్రత్యేక అభినందనలు. భారతీయ సినిమాకి ఈ అవార్డులు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని చిరు అన్నారు.

# కోహ్లీ రికార్డును బద్దలు కొట్టిన శుభ్‌మన్ గిల్

ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ నుంచి టీమ్‌ఇండియా కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్.. ఆటగాడిగానూ తన ఆటతో రికార్డులు బద్దలు కొడుతున్నాడు. ఓవల్ వేదికగా జరుగుతున్న ఐదో టెస్టులో పరుగుల జాబితాలో భారత మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీని అధిగమించాడు. ప్రస్తుతం జరుగుతున్న అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ప్రదర్శన అసాధారణమైనది. ఈ సిరీస్‌లో గిల్ ఇప్పటివరకు 722 పరుగులు చేయగా.. యావరేజ్ 90గా ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగిన ఒకే మ్యాచ్‌లో అతని రికార్డు బద్దలు కొట్టిన 430 పరుగులు చేసి.. అలన్ బోర్డర్‌తో పాటు రెండు ఇన్నింగ్స్‌లలో 150 కంటే ఎక్కువ పరుగులు చేసిన రెండవ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారతదేశం తరపున కెప్టెన్‌గా అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ 2016 రికార్డును కూడా గిల్ బద్దలు కొట్టాడు. ఒకే సిరీస్‌లో అతను నాలుగు సెంచరీలు సాధించి, సునీల్ గవాస్కర్, డాన్ బ్రాడ్‌మాన్ వంటి దిగ్గజాల రికార్డులను సమం చేశాడు. ఈ సిరీస్‌లో గిల్ ఫామ్ భారతదేశానికి చాలా కీలకంగా ఉంది. స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌తో కలిసి, విదేశాల్లో టెస్ట్ సిరీస్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేసిన తొలి భారతీయ పార్ట్‌నర్స్‌గా నిలిచారు. గత 50 ఏళ్లలో ఏ టీమ్‌ఇండియా బ్యాటింగ్ పార్ట్‌నర్స్ కూడా ఈ ఘనత సాధించలేదు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పరిస్థితుల్లో బౌలర్లు ఇబ్బంది పడుతున్నప్పటికీ గిల్ నిలకడ భారతదేశాన్ని ఆటలో నిలిపాడు. ఇప్పుడు తాజాగా వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ పరుగుల జాబితాలో విరాట్ కోహ్లీని అధిగమించాడు కెప్టెన్ శుభ్‌మన్ గిల్.

# రూట్ నుంచి అంతటి తీవ్ర ప్రతిస్పందనను ఊహించలేదు

**జో రూట్ తో వాగ్వాదం పై ప్రసిద్ధ్ కృష్ణ క్లారిటీ**

ఓవల్ టెస్టులో భారత యువ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ, ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ మధ్య జరిగిన మాటల యుద్ధం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రసిద్ధ్ కృష్ణ రూట్‌ను కవ్విస్తూ మాట్లాడటం, అందుకు రూట్ తీవ్రంగా స్పందించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ ఘటన ఒక వ్యూహంలో భాగమేనని, కానీ రూట్ అంతలా స్పందిస్తాడని తాను ఊహించలేదని ప్రసిద్ధ్ కృష్ణ తెలిపాడు. ఓవల్ టెస్టులో ఇంగ్లాండ్ బ్యాటింగ్ సమయంలో ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్ వేస్తున్నప్పుడు జో రూట్ క్రీజులోకి వచ్చాడు. రూట్ ఇంకా పరుగులేమీ చేయకముందే, ప్రసిద్ధ్ కృష్ణ అతడిని ఉద్దేశించి కొన్ని మాటలు అన్నాడు. స్టంప్ మైక్‌లో ఆ మాటలు సరిగా వినబడలేదు కానీ, తాను రూట్‌తో మీరు మాంచి ఫామ్‌లో ఉన్నారు అని చెప్పానని ప్రసిద్ధ్ కృష్ణ వివరించాడు. ఈ మాటలకు రూట్ కోపంతో బదులివ్వడం చూసి ప్రసిద్ధ్ కృష్ణ ఆశ్చర్యపోయాడు. ఈ ఘటన తర్వాత అంపైర్ కుమార్ ధర్మసేన జోక్యం చేసుకుని ప్రసిద్ధ్ కృష్ణతో మాట్లాడారు.

# నా రాముడు ఎప్పటికీ రామ్‌చరణే

**మహావతార్ నరసింహ డైరెక్టర్ అశ్విని కుమార్**

హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై మహావతార్ సినెమాటిక్ యూనివర్స్నుంచి వచ్చిన తొలి మైథలాజికల్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ 'మహావతార్ నరసింహ' బాక్సాఫీస్ వద్ద హవా కొనసాగిస్తోంది. విడుదలైనప్పటి నుంచే అద్భుత రెస్పాన్స్ దక్కించుకున్న ఈ చిత్రం రెండో వీకెండ్‌లో మరింత కలెక్షన్స్ రాబడుతుంది. అడ్వాన్స్ బుకింగ్స్ పెద్ద ఎత్తున నమోదవుతుండటంతో, సినిమా హాళ్ల వద్ద సందడి నెలకొంది. ఈ విజయం నేపథ్యంలో దర్శకుడు అశ్విన్ కుమార్ కూడా చిత్రానికి మరింత బజ్ తీసుకొచ్చే భాగంగా పోస్ట్-రిలీజ్ ప్రమోషన్లలో పాల్గొంటున్నారు. ఇకపోతే, తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో డైరెక్టర్ అశ్విన్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఈ ఫ్రాంచైజీలో లైవ్ యాక్షన్ ఫిల్మ్ తీసే అవకాశం వస్తే.. అందులో శ్రీరాముడిగా ఎవరిని తీసుకుంటారనే ప్రశ్నకు ఆయన నేరుగా రామ్‌చరణ్ పేరును చెప్పుకొచ్చాడు.




నిజానికి సోషల్ మీడియాలో ఇప్పటికే రామ్‌చరణ్‌కి శ్రీరాముడి పాత్రకు భారీ డిమాండ్ ఉంది. డైరెక్టర్ అశ్విన్ కుమార్ తాజాగా చేసిన వ్యాఖ్యలు వాటికి మరింత అతన్ని ఇచ్చాయి. అయితే, దీనికి కారణం లేకపోలేదు.. ముఖ్యంగా ట్రిపుల్ ఆర్ చిత్రంలో అల్లూరి సీతారామరాజుగా రామ్‌చరణ్ చేసిన క్లైమాక్స్ విజువల్స్ చూసిన తర్వాత, అభిమానులు చరణ్ అచ్చం శ్రీరాముడిలా కనిపించారని అనేకమంది అభిప్రాయపడ్డారు. ఉత్తర భారతదేశంలోని ప్రేక్షకులలో కూడా ఈ పాత్రకు రామ్‌చరణ్‌ను మరింత దగ్గరగా అనిపించారని భావిస్తున్నారు. ఇప్పటికే మహావతార్ సినెమాటిక్ యూనివర్స్‌కు పునాది పడిపోయిన నేపథ్యంలో.. రాబోయే కాలంలో ఇందులో లైవ్ యాక్షన్ ప్రాజెక్ట్స్ కూడా రానున్నాయన్న అంచనాలు ఉన్నాయి. అందులో భాగంగా రామ్‌చరణ్ శ్రీరాముడిగా కనిపించబోతున్నారా..? అన్నది ఇప్పుడు ఆసక్తికరమైన ప్రశ్నగా మారింది. కాకపోతే ఇది ఇప్పట్లో ఖరారయ్యే విషయం కాదు. కానీ, ఈ చర్చ మాత్రం సోషల్ మీడియాలో నాన్‌స్టాప్‌గా నడుస్తోంది. అభిమానుల ఆశలు, దర్శకుడి ఆసక్తికర అభిప్రాయంతో ఈ బజ్ మరింత పెరిగే అవకాశముంది. రాబోయే రోజుల్లో ఈ విషయంపై మరిన్ని అప్‌డేట్స్ వచ్చినా ఆశ్చర్యం లేదు. ఇకపోతే మహావతార్ నరసింహ సినిమా మరో మైలురాయిని చేరుకుంది. దేశంలోని యానిమేటెడ్ సినిమాల్లో చరిత్ర సృష్టించింది. హోంబలే ఫిల్మ్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమా 8 రోజుల్లోనే రూ.60.5 కోట్లు- వసూళ్లను సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. దేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు నెలకొల్పిందని పేర్కొంది. 8 రోజుల్లోనే ఈ ఘనతను సాధించడం ఆనందంగా ఉందని తెలిపింది. మరోవైపు అమెరికాలోనూ ఈ సినిమా ఆదరణ సొంతం చేసుకుంటోంది. వన్ మిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిందని అక్కడి నిర్మాణసంస్థ వెల్లడించింది. ఇది డివైన్ బ్లాక్‌బస్టర్ అని పేర్కొంది.

# రెండోభాగం మరింత ఆసక్తిగా ఉంటుంది

**కింగ్డమ్ సీరియల్‌పై విజయ్ దేవరకొండ**

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ భారీ వసూళ్లను రాబడుతోంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. భారీ అంచనాల నడుమ జూలై 31వ తేదీన విడుదలైన 'కింగ్‌డమ్' చిత్రం.. విమర్శకుల ప్రశంసలతో పాటు-, ప్రేక్షకులను మెప్పు పొందుతోంది. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా.. వెండితెరపై ఓ కొత్త అనుభూతిని కలిగిస్తోందని, విజువల్ గా అద్భుతంగా ఉందని చూసిన ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. 'కింగ్‌డమ్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందన నేపథ్యంలో.. తాజాగా పాత్రికేయులతో ముచ్చటించిన విజయ్ దేవరకొండ, పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కేవలం తెలుగు రాష్ట్రాలలో మాత్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాల్లో, ఓవర్సీస్ లో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మలయాళంలో ఈ స్థాయి స్పందన ఊహించలేదు. మలయాళ వెర్షన్ విడుదల చేయకపోయినా.. అక్కడి ప్రేక్షకులు ఇంతటి ప్రేమ చూపించడం చాలా ఆనందంగా ఉందని విజయ్ అన్నారు. కెరీర్ ప్రారంభంలో సినిమా హిట్ అయితే సెలెబ్రేట్ చేసుకోవాలనే ఆలోచన ఉండదు. ఎందుకంటే ఒక సినిమా హిట్ అయితే ఇంకో సినిమా చేసే అవకాశం వస్తుందని ఆశ ఉంటుంది. పెళ్లి చూపులు హిట్ అయినప్పుడు.. ఇంకొన్ని అవకాశాలు వస్తాయని ఆనందపడ్డాను. కానీ, ఇప్పుడు అలా కాదు. సినిమా హిట్ అయితే ఆనందం కంటే కూడా మరిన్ని మంచి సినిమాలు చేయాలనే బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఒక్కరికీ సినిమా విడుదలకు ముందు ఎంతో కొంత ఒత్తిడి ఉంటుంది. కింగ్‌డమ్ విడుదలకు ముందు మాక్కూడా అలాంటి ఒత్తిడి ఉంది. ఎప్పుడైతే మొదటి షో పూర్తయ్యి, పాజిటివ్ వచ్చిందో.. అప్పుడు చాలా సంతోషం కలిగిందన్నారు. గౌతమ్ కుటుంబ బంధాలను, ఎమోషన్స్ ని డీల్ చేసే విధానం నాకు ఇష్టం. అన్నదమ్ముల అనుబంధం



నేపథ్యంలో గ్యాంగ్ స్టర్ డ్రామా అనే ఐడియా గౌతమ్ చెప్పినప్పుడు నాకు చాలా ఆసక్తికరంగా అనిపించింది. జెర్సీ లాంటి ఎమోషనల్ జర్నీలో కూడా మనకు హై ఇచ్చే మూమెంట్స్ ఉంటాయి. గౌతమ్ కి ప్రతి విషయం మీద పట్టు- ఉంటుంది. హీరో పాత్ర, షాట్ కంపోజిషన్, మ్యూజిక్ ఇలా ప్రతిదాని మీద ఎంతో శ్రద్ధ తీసుకుంటాడు. కింగ్‌డమ్ కోసం ఆసక్తికర కథనం రాశాడు. ఇందులో ఏదో యాక్షన్ సన్నివేశం పెట్టాలి కదా అన్నట్టుగా ఎక్కడా పెట్టలేదు. దాని చుట్టూ బలమైన ఎమోషన్ ఉండేలా చూసుకున్నాడు. ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ప్రధానంగా కథ ఉంటుంది. కానీ, ఇందులో దేశభక్తికి సంబంధించిన అంశముంది. అలాగే, ఒక తెగకు చెందిన నాయకుడి గురించి ఉంటుంది. ఇలా ఇన్ని అంశాలను ఒకే భాగంలో చెప్పడం సాధ్యంకాదు. అందుకే రెండు భాగాలుగా చెప్పాలని నిర్ణయించు కున్నాము. తన అన్నయ్య శివ కోసం సూరి చేసిన ప్రయాణాన్ని మొదటి భాగంలో చూశాం. రెండవ భాగానికి సంబంధించి గౌతమ్ దగ్గర గొప్ప గొప్ప ఆలోచనలు ఉన్నాయి. మొదటి భాగంతో పోలిస్తే రెండవ భాగంగా ఇంకా అద్భుతంగా ఉండబోతుందని వివరించాడు.

# మా మధ్య ఎమోషన్స్ తెగిపోయాయి

**లేషన్‌షిప్‌లో కాంప్రమైస్ అవ్వడం చాలా ముఖ్యం**

**విడాలకుపై తొలిసారి స్పందించిన చాహల్**

టీమ్‌ఇండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ ఎట్టకేలకు ధన శ్రీ వర్మతో విడాకుల విషయంపై మాట్లాడాడు. రీసెంట్?గా ఓ పాడ్?కాస్ట్?లో పాల్గొన్న చాహల్ తన విడాకులకు గల కారణాలు వెల్లడించాడు. ఈ నిర్ణయం ఒక్కరోజులో తీసుకుంది కాదని, చాలా ఆలోచించిన తర్వాతే తాను ధన శ్రీతో విడిపోయినట్లు చెప్పుకొచ్చాడు."వివాహ బంధానికి స్వస్తి చెప్పి, విడాకులు తీసుకోవాలన్న ఆలోచన మా ఇద్దరికీ ఉండేది. అయితే ఈ విషయం ఆఖరి వరకూ గోప్యంగానే ఉంచాలని నిర్ణయించుకున్నాం. మా పర్సనల్ లైఫ్ గురించి బయట పెట్టకూడదనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాం. అంతేకాదు మా ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నప్పటికీ చాలాకాలం బయటి ప్రపంచానికి భార్యాభర్తలుగానే కనిపించాం""మేమిద్దరం మా పర్సనల్ కెరీర్‌లో సక్సెస్ కావాలని అనుకున్నాం. అందుకే రిలేషన్‌షిప్‌కు ప్రాధాన్యం ఇవ్వలేకపోయాం. మా మధ్య ఎమోషన్స్ తెగిపోయాయి. ఇద్దరి ఆశయాలు, ఆలోచనలు, వ్యక్తిత్వాలు ఒకే మార్గంలో లేనప్పుడు రిలేషన్‌షిప్‌పై ఎఫెక్ట్ పడుతుంది. రిలేషన్‌షిప్‌లో కాంప్రమైస్ అవ్వడం చాలా ముఖ్యం. ఒకరు కోపంగా ఉన్నప్పుడు, ఇంకొకరు సైలెంట్?గా వాళ్లు చెప్పింది వినాలి. ఒక్కోసారి ఇద్దరి వ్యక్తుల వ్యక్తిత్వాలు మ్యాచ్ అవ్వవు"

'కెరీర్‌లోపై సీరియస్?గా ఉన్నప్పుడు భాగస్వామికి సమయం ఇవ్వడం కష్టం అవుతుంది. ఆ పరిస్థితులను మరొకరు అర్థం చేసుకోవాలి. నేను టీమ్‌ఇండియాకు ఆడుతున్నా, ఆమె తన ప్రొఫెషన్?లో ఉంది. ఇలా 1-2 సంవత్సరాలు కొనసాగింది. ప్రతీ ఒక్కరికీ తమ కెరీర్?లో పర్సనల్ గోల్స్ ఉంటాయి. ఓ భాగస్వామిగా ఇద్దరూ పరస్పరం మద్దతు ఇచ్చుకోవాలి. నువ్వు ఏదో సాధించాలని 18-20 ఏళ్లుగా కష్టపడుతుంటే, ఆ కలను రిలేషన్?షిప్? కోసం వదులుకోకూడదు" అని చాహల్ పేర్కొన్నాడు. అలాగే ధన శ్రీతో విడిపోయిన తర్వాత తనను మోసగాడు అంటూ సోషల్ మీడియాలో ట్రోల్ చేశారని చాహల్ గుర్తుచేసుకున్నాడు. ఆ సయమంలో కొన్నిసార్లు తనకు సూసైడ్ ఆలోచనలు కూడా వచ్చాయని తెలిపాడు. "డివోర్స్? తర్వాత చాలామంది నన్ను మోసగాడిగా అభివర్ణించారు. కానీ నేనెప్పుడూ ఎవరిని కూడా మోసం చేయలేదు. చాలా నమ్మకమైన వ్యక్తిని నేను. నాలాంటి వ్యక్తిని మీరు చూడరు. నా విషయంలో కొంతమందికి ఏం జరిగిందో మాత్రం నాకు తెలియదు. కానీ నన్ను తప్పుబట్టారు""చాలామంది విమర్శించారు కూడా. మోసగాడు అంటూ కామెంట్లు కూడా చేశారు. నాకు ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. వారితోనే కలిసి పెరిగాను. మహిళలను ఎలా గౌరవించాలనేది, నా తల్లిదండ్రులు నేర్పారు. నాకు సంస్కారం ఉంది. కానీ, నా పేరును ఇతరులతో లింక్ చేసి, వాళ్ల వ్యూస్ కోసం చాలా కథనాలు రాశారు. అలాంటి సమయంలో తీవ్ర ఒత్తిడికి గురయ్యా. రోజులో 2 గంటలే నిద్ర పోయిన సందర్భాలూ ఉన్నాయి. 45 రోజులపాటు కంటిమీద కునుకు లేదు. క్రికెట్ నుంచి విరామం తీసుకున్నా.

## ఓజీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ విడుదల




టాలీవుడ్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న తాజా చిత్రం 'ఓజీ'. 'సాహో' ఫేం సుజీత్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా.. ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ అభిమానులను అలరించాయి ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ నుంచి పవర్‌ఫుల్ సాంగ్ ఓజీ ఫైర్ స్టోర్మ్ ని విడుదల చేశారు మేకర్స్. థమన్ సంగీతం అందించిన ఈ పాటకు థమన్ ఎస్ , నజీరుద్దీన్ భరతరాజ్ , సిలంబరసన్ టిఆర్ (శింబు) , దీపక్ బ్లూ, రాజా కుమారి కలిసి పాడారు.


## దూసుకుపోతున్న సైయారా మూవీ

### సైలెంట్‌గా కలెక్షన్లు రాబడుతున్నట్లు వెల్లడి




అహన్ పాండే, అనీత్ పడ్డా జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్-టైనర్ 'సైయారా' మూవీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ప్రేమకథా చిత్రం ప్రస్తుతం మూడో వారంలోకి అడుగు పెట్టింది. శుక్రవారం 'సన్ ఆఫ్ సర్దార్ 2' , 'ధడక్ 2' విడుదలైనప్పటికీ 'సైయారా'కు ప్రేక్షకుల్లో ఆదరణ తగ్గలేదు. ఈ చిత్రం 15 రోజుల్లో దాదాపు రూ.284 కోట్లను రాబట్టింది. ఈ వారాంతానికి రూ.300 కోట్లు- వసూలు చేస్తుందని మార్కెట్ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. 'సైయారా' రెండో వారంలో 107.75 కోట్లను రాబట్టింది. బాలీవుడ్‌లో రెండో వారంలో అత్యధిక వసూళ్లు సాధించిన పదో చిత్రంగా నిలిచి రికార్డు సృష్టించింది. 'ది కశ్మీర్ ఫైల్స్' (రూ.108.97 కోట్లు-), 'దంగల్' (రూ.115.96 కోట్లు-), జవాన్ (రూ.125.46 కోట్లు-) చిత్రాలు 'సైయారా' కంటే ముందున్నాయి. మొదటివారంతో పోల్చుకుంటే.. రెండో వారంలో కలెక్షన్లు కాస్త తగ్గినప్పటికీ.. మూడోవారమూ విజయవంతంగా ప్రదర్శితమయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అజయ్‌దేవ్‌గణ్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2', సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్ర పోషించిన 'ధడక్ 2'కు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనే దక్కుతోంది. ఇది జులై 18న విడుదలైన 'సైయారా'కు కలిసివస్తోంది.

## రెండోభాగం మరింత ఆసక్తిగా ఉంటుంది



టాలీవుడ్ నటి, యాంకర్ అనసూయ కొందరు యువకులకు అసభ్య కామెంట్లు చేస్తే చెప్పు తెగుద్ది అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కపూరంలోని ఓ షాపింగ్‌మాల్ ఓపెనింగ్‌లో భాగంగా అక్కడికి వెళ్లిన అనసూయని కొందరు ఆకతాయిలు కామెంట్లు- చేయడం మొదలుపెట్టారు. దీంతో అనసూయ వారికి గట్టిగా వార్నింగ్ ఇచ్చింది. చెప్పు తెగుద్ది.. మీ ఇంట్లో అమ్మ, చెల్లి, భార్య కుటుంబసభ్యులను ఇలాగే కామెంట్లు- చేస్తే ఊరుకుంటారా. పెద్దవాళ్లకి మర్యాద ఇవ్వడం మీ ఇంట్లో నేర్పలేదా అంటూ అనసూయ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# సత్తాచాటిన భారత బౌలర్లు

### ఇంగ్లాండ్ 247 ఆలౌట్



ఇంగ్లాండ్, ఇండియా జట్ల మధ్య జరుగుతున్న ఐదో టెస్టు రసవత్తరంగా జరుగుతోంది. తొలి ఇన్నింగ్స్ లో ఇంగ్లాండ్ ను నిలువరించిన భారత్.. తమ రెండో ఇన్నింగ్స్ ను మెరుగ్గా ప్రారంభించింది. శుక్రవారం రెండోరోజు ఆటముగిసేసరికి రెండో ఇన్నింగ్స్ లో భారత్ 18 ఓవర్లలో రెండు వికెట్లకు 75 పరుగులు చేసింది. విధ్వంసక ఓపెనర్ యశస్వి జైస్వాల్ సూపర్ ఫిఫ్టీ (49 బంతుల్లో 51 బ్యాటింగ్, 7 ఫోర్లు, 2 సిక్సర్లు) సూపర్ టచ్ లో కనిపించాడు. క్రీజులో అతనితోపాటు నైట్ వాచ్ మన్ ఆకాశ్ దీప్ (4 బ్యాటింగ్) ఉన్నాడు. ఓవరాల్ గా ఇండియా ఆధిక్యం 52 పరుగులకు చేరుకుంది. ఓపెనర్ కేటఎల్ రాహుల్ (7), సాయి సుదర్శన్ (11) విఫలమయ్యారు. జోష్ టంగ్, గస్ అట్కిన్సన్ చెరో వికెట్ తీశారు. శనివారం మొత్తం బ్యాటింగ్ చేసి, వీలైనంత ఎక్కువగా టార్గెట్ ను ఇంగ్లాండ్ కు విధించాలని టీమిండియా భావిస్తోంది. అంతకుముందు ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్ లో 247 పరుగులకు ఆలౌట్ కాగా, ఇండియా 224 పరుగులు చేసింది. ఐదు టెస్టుల అండర్సన్- టెండూల్కర్ ట్రోఫీలో 2-1తో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉంది. పేసర్లకు స్వర్గధామమైన ఈ వికెట్ పై బౌలర్లు శుక్రవారం పండుగ చేసుకున్నారు. రెండో రోజు ఏకంగా 16 వికెట్లు నేలకూలడం విశేషం. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరు 204/6 తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా.. మరో 20 జోడించి మిగతా నాలుగు వికెట్లు కోల్పోయింది. కరుణ్ నాయర్ తన అర్ధ సెంచరీకి మరో ఐదు పరుగులు జోడించి ఔటవగా, గస్ అట్కిన్సన్ భారత లోయర్ ఆర్డర్ ను కకావికలం చేశాడు. వాషింగ్టన్ సుందర్ (26)లతోపాటు మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణను ఔట్ చేసి, ఫైఫర్ పూర్తి చేసుకున్నాడు. దీంతో భారత ఇన్నింగ్స్ 224 పరుగుల వద్ద ముగిసింది. మిగతా బౌలర్లలో జోష్ టంగ్ కు ఒక వికెట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ అదిరే ఆరంభం దక్కింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (64), బెన్ డకెట్ (43) జట్టుకు శుభారంభాన్నిచ్చారు. తొలి వికెట్ కు వేగవంతంగా ఆడి 77 బంతుల్లోనే 92 పరుగులు జోడించారు. అయితే డకెట్ వికెట్ తీసిన ఆకాశ్ దీప్ బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత ప్రసిధ్ నాలుగు, సిరాజ్ మూడు వికెట్లతో చెలరేగి ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ ను దెబ్బ తీశారు. మిడిలార్డర్ బ్యాటర్ హేరీ బ్రూక్ అద్భుతమైన ఫిఫ్టీ (53)తో చెలరేగడంతో ఇంగ్లాండ్ కు 23 పరుగుల ఆధిక్యం దక్కింది. ఈ మ్యాచ్ లో కేవలం ముగ్గురు పేసర్లు మాత్రమే బరిలోకి దిగగా, వారే ఇంగ్లాండ్ ఆలౌట్ చేయడం విశేషం. ఇక ఇంగ్లాండ్ వెటరన్ పేసర్ క్రిస్ వోక్స్ గాయం కారణంగా ఈ టెస్టులో అందుబాటులో ఉండటం లేదు. దీంతో ముగ్గురు పేసర్లతోనే ఇంగ్లాండ్.. రెండో ఇన్నింగ్స్ లో బౌలింగ్ చేయించనుంది. ఇక వీలైనంత ఎక్కువ పరుగులు చేసి, ఇంగ్లాండ్ కు కాస్త కష్ట సాధ్యమైన టార్గెట్ నిర్దేశించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. అలాగే ఈ మైదానంలో అత్యధిక ఛేదన 263 కావడం విశేషం. ఇంగ్లాండ్ కు అంతకంటే ఎక్కువ టార్గెట్ విధించాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

# 2025 ఆసియా కప్ లో బుమ్రా ఆడటం కష్టమే




భారత క్రికెట్ జట్టు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఇంగ్లండ్‌తో జరుగుతున్న 5వ టెస్ట్ మ్యాచ్ ఆడటం లేదు. కెన్నింగ్టన్ ఓవల్‌లో జరుగుతున్న సిరీస్‌లోని కీలకమైన చివరి టెస్టులో బుమ్రా లేడు. వాస్తవానికి చివరి టెస్ట్ నుంచి అతడికి బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. బుమ్రా త్వరలో జరగనున్న ఆసియా కప్‌లో ఆడటం కష్టమేనని వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో నిర్వహిస్తున్న ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో కేవలం 3 టెస్టులు మాత్రమే బుమ్రా అందుబాటులో ఉంటాడని సిరీస్ కు ముందే బీసీసీఐ స్పష్టం చేసింది. అందుకు తగ్గట్లుగానే స్టార్ పేసర్ మూడు టెస్టులు మాత్రమే ఆడాడు, రెండు టెస్టులకు అందుబాటులో లేడు. శుక్రవారం ప్రారంభమైన చివరి టెస్టు జట్టు నుంచి బుమ్రాను రిలీజ్ చేశారు. ముఖ్యమైన విషయం ఏంటంటే, కెన్నింగ్టన్ ఓవల్‌లో ప్రాక్టీస్ సెషన్‌కు కూడా బుమ్రా రాలేదు. ఇంగ్లాండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ సైతం ఈ టెస్టు ఆడటం లేదు. కానీ బుమ్రాలా కాకుండా స్టోక్స్ తన జట్టుతోనే ఉన్నాడు. ఆల్ రౌండర్ ప్రాక్టీస్ సెషన్‌లకు హాజరయ్యాడు. కానీ జస్ప్రీత్ బుమ్రా ఆ పని చేయలేదు.వర్క్‌లోడ్ కింద జస్ప్రీత్ బుమ్రా ఆసియా కప్ నుంచి సైతం దూరంగా ఉండే అవకాశం ఉంది. 2025 ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరుగుతుంది. ఆసియా కప్ ఫైనల్ సెప్టెంబర్ 29న జరుగుతుంది. ఆ వెంటనే అక్టోబర్ 2 నుండి వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. దాంతో బుమ్రాపై ఓవర్ లోడ్ ఉండకూడదని, టెస్ట్ సిరీస్ కోసం పేసర్ కావాలనుకుంటే ఆసియా కప్ నుంచి తనకు విశ్రాంతి ఇస్తారని ప్రచారం జరుగుతోంది. "ఇది కష్టమైన నిర్ణయం అని చెప్పవచ్చు. బుమ్రాకు టెస్ట్ క్రికెట్ అంటే ఇష్టం. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్లు కూడా మనకు చాలా ముఖ్యం. టీ20 విషయానికొస్తే జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌కు అందుబాటులో ఉంటాడు. ఇది టీ20 ప్రపంచ కప్ కోసం భారత్‌కు కీలకమైన సిరీస్ కానున్నాయి" అని న్యూస్ ఏజెన్సీ పీటీఐ వర్గాల సమాచారం అని రాసుకొచ్చింది. గత టీ20 వరల్డ్ కప్ నెగ్గిన తరువాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లితో పాటు ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా సైతం పొట్టి ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నివేదికలో ఉటంకిస్తూ, "ఒకవేళ జస్ప్రీత్ బుమ్రా 2025 ఆసియా కప్ ఆడితే కనుక అహ్మదాబాద్‌లో జరిగే వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌కు బుమ్రా అందుబాటులో ఉండడు. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ కోసం జట్టులో బుమ్రా అవసరం ఉంటుందని అందరికీ తెలుసు. అతను ఆసియా కప్ ఆడితే వెస్టిండీస్‌తో జరిగే టెస్ట్ సిరీస్ నుంచి విశ్రాంతి తీసుకుంటాడు. విండీస్ సిరీస్ వదులుకోవాలంటే ఆసియా కప్ లో బుమ్రాను చూడవచ్చు" అని పీటీఐ పేర్కొంది.

## సాయి సుదర్శన్, బెన్ డకెట్ మధ్య తీవ్ర వాగ్వాదం

ప్రస్తుతం ఇంగ్లాండ్, భారత్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ చివరి దశకు చేరుకుంది. ఓవల్ మైదానంలో జరుగుతున్న ఐదవ టెస్ట్ మ్యాచ్ లో ఇరు జట్ల మధ్య మాటల యుద్ధం, వాదనలు సర్వసాధారణంగా మారాయి. రెండో రోజు ఆటలో కూడా అదే పరిస్థితి కనిపించింది. సాయి సుదర్శన్, బెన్ డకెట్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటన ఆ తర్వాత మ్యాచ్ లో మరింత ఉద్రిక్తతను పెంచింది.రెండో రోజు ఆట ముగింపులో టీమిండియా యువ బ్యాట్స్‌మెన్ సాయి సుదర్శన్, ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. సాయి సుదర్శన్ అవుట్ అయి పెవిలియన్ వైపు వెళ్తున్నప్పుడు, డకెట్ ఏదో అనడంతో ఈ గొడవ మొదలైంది. ఓవల్ టెస్ట్ రెండో రోజు ఆట చివరి సెషన్‌లో, భారత రెండో ఇన్నింగ్స్ సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 18వ ఓవర్‌లో, గస్ అట్కిన్సన్ బౌలింగ్‌లో సాయి సుదర్శన్‌ను ఎల్బీడబ్ల్యూగా అంపైర్ అవుట్ ఇచ్చాడు.సుదర్శన్ డీఆర్ఎస్ తీసుకున్నప్పటికీ, మూడో అంపైర్ కూడా అవుట్ అని నిర్ధారించాడు. దీంతో సాయి సుదర్శన్ నిరాశగా పెవిలియన్ వైపు నడుస్తున్నాడు. అదే సమయంలో, ఫీల్డింగ్ చేస్తున్న బెన్ డకెట్ సాయి సుదర్శన్‌ను ఉద్దేశించి ఏదో అన్నాడు. ఆ మాటలు విని సుదర్శన్ ఒక్కసారిగా వెనక్కి తిరిగి, డకెట్‌కు గట్టిగా బదులిచ్చాడు. ఆ తర్వాతే అతను పెవిలియన్‌కు వెళ్లాడు. వారి మధ్య సంభాషణ ఏమిటనేది స్పష్టంగా తెలియకపోయినా, ఈ సంఘటన మ్యాచ్‌లో ఉద్రిక్తతను మరింత పెంచింది. రెండో రోజు ఆటలో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య చాలా వాదనలు జరిగాయి.ఓవల్ టెస్ట్‌లో భారత బౌలర్ మహ్మద్ సిరాజ్ ఒక అరుదైన రికార్డును నెలకొల్పాడు. టెస్ట్ క్రికెట్‌లో 200 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనత సాధించిన భారతీయ బౌలర్లలో సిరాజ్ 19వవాడు. ఓవల్ టెస్ట్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి, భారత జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసి, ఇంగ్లండ్‌పై 52 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా ఆడి, 49 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 51 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. అతనితో పాటు నైట్‌వాచ్‌మెన్ ఆకాశ్‌దీప్ సింగ్ క్రీజులో ఉన్నాడు. మూడో రోజు ఆటలో జట్టును ముందుకు నడిపించే భారీ బాధ్యత ఇప్పుడు యశస్వి జైస్వాల్‌పై ఉంది.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609